

ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

## స్టేట్ విజన్

STATE VISION

ఆదివారం 17-05-2026 పేజీలు : 16


బావిలో ఈత కొడుతూ

# మృత్యు ఒడిలోకి

- ఆలస్యంగా గమనించిన సహచరులు 30 మంది మధ్య విషాదం
- మృతదేహాన్ని వెలికి తీసిన ఫైర్ సిబ్బంది
- ఊర్కొండ మండలం ఊర్కొండపేటలో ఘటన కుటుంబసభ్యుల కన్నీరుమున్నీరు

9 పేజీలో...



విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

--జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్.

--మాత శిశు ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్.

--ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీసిన కలెక్టర్.

14 పేజీలో...

శివంపేట్ గ్రామంలో మంజీరా నది నుంచి

# అక్రమ ఇసుక తరలింపు

- స్థానికుల ఆందోళన
- పర్యావరణానికి ముప్పు
- అధికారుల మౌనం
- పగటిపూట నిశ్శబ్దంగా ఉంటూ.. చీకటి పడగానే [illegible]



16 పేజీలో...

# ఆకట్టుకున్న ఉన్నత విద్యా మార్గదర్శక మేళా

### అభినందించిన ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకృష్ణా రెడ్డి

విజన్ ఆంధ్ర(16) హైదరాబాద్ ఉప్పల్ శిల్పారామంలో భారీ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిన్న ఈరోజు నిర్వహిస్తున్నారు, శిల్పారామం వేదికగా తెలంగాణ అతిపెద్ద ఎడ్యుకేషన్ ఫెయిర్ విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణా రెడ్డి పాల్గొని అన్నారు, తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో నిన్న ఈరోజు, ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు, ఉన్నతవిద్య, ప్రొఫెషనల్ కోర్సులు, ఇంజినీరింగ్, ఫార్మసీ, డిగ్రీ అడ్మిషన్లు, స్కాలర్‌షిప్స్ మరియు కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక అవగాహన కల్పిస్తుందని, ఈఫెయిర్‌లో వివిధ ప్రముఖ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు పాల్గొని విద్యార్థులకు నేరుగా కౌన్సెలింగ్ అందిస్తు, ఎంసెట్, జేఈఈ, నీట్ తర్వాత ఏకోర్సు ఎంచుకోవాలి, ఏ కాలేజీ మంచి అవకాశాలు వంటి అంశాలపై నిపుణులు మార్గనిర్దేశం చేస్తున్నారు, విద్యార్థులు మరియు తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తుందని నిర్వాహకులు తెలిపారు, ఈరోజు కూడా ఇంకా సందర్శించని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొనాలని అన్నారు



ఎమ్మెల్యే స్పందిస్తే సమస్యే ఉండదు,

# మళ్లీ ఈ ముప్పు తప్పదా..?

-15 చోట్ల వరద ముప్పు

- ద్వీపకల్పంలా మారనున్న గ్రామాలు భార్యాభర్తలు గల్లంతు..?

9 పేజీలో...

- కూచూర్, చెన్నారెడ్డిపల్లిలో గతేడాది వరద బీభత్సం ఫోటోలు సాక్ష్యం
- కల్వర్టు నిర్మించరు, రోడ్డు పునర్నిర్మించరు ఏడాదైనా కదలని యంత్రాంగం
- ఎమ్మెల్యే, అధికారులు చర్యలు తీసుకుంటే ఇలాంటి పరిస్థితులు ఉండవు
- కిష్టారం-అంబటిపల్లి గ్రామాల మధ్య అలుగు ఉధృతికి భార్యా భర్తలు గల్లంతు
- ప్రతి వర్షాకాలం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటాల్సిందేనా..?



# బాల్కొండ లో లభ్య మైన విగ్రహాల పై విచారణ

బాల్కొండ విజన్ ఆంధ్ర (ఆర్. సి) మే 16:- 2025 ఫిబ్రవరి నెల లో అల్లకొండ ఖిల్లా వద్ద గుర్తు తెలియని వ్యక్తులు గృహ నిర్మాణలా పునాదులు తీస్తూ ఉండగా పురాతన విగ్రహాలు లభ్యశీ కావడం,విగ్రహాల అదృశ్యం పై కరీంనగర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సాగర్ తో పాటు టెక్నికల్ అధికారి రవితేజ, జె. ఏ. గౌస్,శనివారం రోజు విచారణ నిమిత్తం గ్రామ పంచాయతి కార్యాలయానికి చేరుకోగానే స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గాండ్ల రాజేష్, ఉప సర్పంచ్ రాజేందర్, అధికారిని సాధారంగా ఆహ్వానించి విగ్రహాల విషయంపై సమాచారాని అధికారికి వివరించారు.అలాగే 1059 లో ఏర్పడిన అల్ల కొండ ఖిల్లా అభివృద్ధి విషయంలో ఖిల్లాలో పెరుక పోయిన ముల్ల పొదలు తొలగింపు, పర్యటకుల సౌక ర్యార్థం ఖిల్లా ప్రధాన ద్వారం నుండి అత్త కోడళ్ల భావి వరకు రోడ్డు తో పాటు విద్యుత్ స్థంబాల ఏర్పాటు గురించి అధికారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబెర్స్ సందీప్, తదితగారులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా గత సంవత్సరశీ ఫిబ్రవరి నెలలో ఖిల్లా కొద్దీ దూరంలోని పెద్ద చెరువు అనుకోని ఉన్న కందకం ఒడ్డున గణేష్, నాగుపాము విగ్రహం, గజ ఏనుగుల మధ్యన లక్ష్మీ దేవి విగ్రహం లభ్యం కావడంతో స్థానిక ప్రజలు తశీడోప తండలుగా కొబ్బరి కాయలు కొడుతూ పూజలు చేయడం తో గత పోలీస్ అధికారి పురావస్తు





శాఖ ఉన్నత అధికారులకు తెలుప కుండా గోదావరి నదిలో వేయడం ఇదే విషయాన్ని రాష్ట్ర పురా వస్తు శాఖ డైరెక్టర్ దృష్టికి వెళ్లడంతో విగ్రహాల విషయాన్ని చెదిశీచ దానికి శనివారం రోజున స్థానిక అంబేద్కర్ నగర్ ఈత వనం ఎల్లమ్మ చౌకే వద్ద ఉన్న విగ్రహాలను గుర్తించి ఫొటోలు తీసుకొని వెళ్లారని అల్లకొండ ఖిల్లా పరిరక్షణ సమితికి చెందిన కార్యనిర్వాహక అధ్యక్షులు బ్రహ్మ రౌతు నర్సింగ్ రావు, సంయుక్త కార్యదర్శి డా,, పవన్ కుమార్ విచారణ అధికారి పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.



## స్వర్ణ గిరిలో వసంతోత్సవ సేవ

భువనగిరి మే 16( విజన్ ఆంధ్ర ): స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రం లో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు,పసుపు,సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్ఛారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించినారు. అనంతరం అర్చక స్వాములు కర్పూర మంగళహారతులు సమర్పించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశు లైనారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను గైకొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థన నిర్వహించిన ప్రభుత్వ విప్ బీర్ల

భువనగిరి మే16 ( విజన్ ఆంధ్ర ): కర్ణాటక రాష్ట్రంలోని గంగాపూర్ సమీపంలో ఉన్న ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీ దత్త నిరంజన్ మాత్ ను ఆలేరు ఎమ్మెల్యే మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించినారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు,రైతుల సంక్షేమం,యువతకు మంచి భవిష్యత్తు కలగాలని ప్రార్థించారు. పరమేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, రైతుల సంక్షేమం, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని ప్రార్థించారు. అమరాజా నది తీరంలో నిర్వహించిన పవిత్ర దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొని నదిలో దీపాలను ప్రవాహంలో వదిలారు. దీపాల కాంతులతో నది తీరం ఆధ్యాత్మిక వాతావరణంలో కళకళలాడగా ఎమ్మెల్యే,భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శని దేవాలయాన్ని సందర్శించి శని దేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్థించారు.

# అర్హులకే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి

### - మున్సిపల్ చైర్మన్‌కు సీపీఎం వినతి

షాద్‌నగర్, విజన్ ఆంధ్ర మే 16 : షాద్ నగర్ పట్టణంలోని నిరుపేద ప్రజలకు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఎన్. రాజు, పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా స్వంత ఇంటి కోసం పేద కుటుంబాలు ఎదురుచూస్తున్నాయని తెలిపారు. అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న నిజమైన అర్హులను గుర్తించి రాజకీయ పక్షపాతం లేకుండా పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అవసరమైన వారికే అందేలా చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. రెండో విడత అర్హుల జాబితాను వెంటనే ప్రకటించాలని, ఇండ్ల కేటాయింపులో అవినీతి, ఆలస్యాలకు తావులేకుండా చూడాలని డిమాండ్ చేశారు. నిరాశ్రయ పేద కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించి



ప్రజలకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు హక్కు, ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మి, కావాలి రాజు, మహమ్మద్ బాబు, పారిజాత, మీనాజీ బేగం, లలిత, శ్రీలత, అంజమ్మ, అంగోత్ లక్ష్మి, శ్రీకాంత్, ముఖిత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం...

### ప్రజలకు అండగా కాంగ్రెస్ నాయకుడు తేజావత్ రాంజీ

### - మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు...

### - సొంత డబ్బులతో గ్రామానికి తాగునీరు అందిస్తున్న నాయకుడు రాంజీ..

టేకులపల్లి మే 16 (విజన్ ఆంధ్ర). భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. గ్రామ ప్రజలకు అందాల్సిన మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై గ్రామ ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు, గ్రామ సర్పంచ్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం కనిపించలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తేజావత్ రాంజీ మానవత్వంతో ముందుకొచ్చారు. ప్రజలకు నీళ్లు లేక ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకోలేను అన్న భావనతో తన సొంత ఖర్చులతో గ్రామానికి నీటి సౌకర్యం కల్పిస్తున్నారు. గ్రామంలోని బోరింగ్ చెడిపోవడంతో వెంటనే స్పందించి, బోరులో ఉన్న పాడైన పరికరాలను తొలగించి కొత్త మోటార్ బిగించి తిరిగి నీటి సరఫరా ప్రారంభించారు.ప్రభుత్వ యంత్రాంగం స్పందించాల్సిన సమయంలో ఒక ప్రజా నాయకుడు స్వంత డబ్బులతో గ్రామానికి నీళ్లు అందించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. గ్రామ ప్రజలు ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదు... కానీ తేజావత్ రాంజీ మాత్రం వెంటనే స్పందించి మాకు తాగునీరు అందించారు అంటూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ప్రజల ఆవేదన.

మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం ఉన్నప్పటికీ, గ్రామ స్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో నీటి సమస్య మరింత తీవ్రంగా మారడంతో ప్రజలు ప్రైవేట్ నీటి వనరులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముత్యాలంపాడు ఎక్స్ రోడ్ గ్రామపంచాయతీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి సేవ చేస్తున్న తేజావత్ రాంజీ వంటి నాయకులను అధికారులు ఆదర్శంగా తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



# వెలి జర్లలో సోమవారం బొడ్రాయి బోనాలు

## గ్రామ ప్రజలకు సర్పంచ్ శుభాకాంక్షలు



షాద్ నగర్, విజన్ ఆంధ్రా మే16 : వెలిజర్ల గ్రామ ప్రజలందరికీ బొడ్రాయి బోనాల శుభాకాంక్షలు తెలియజేస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రత్యేక ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 18న సోమవారం గ్రామంలో బొడ్రాయి బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా గ్రామంలోని శివాలయం, రామాలయం, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, ధ్వజస్తంభం, బొడ్రాయి, నవగ్రహాలు, నాగులు, తదితర దేవాలయాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచే భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామ సర్పంచ్ ఆర్. బాబు నాయక్ మాట్లాడుతూ.. గ్రామ శాంతి, సుభిక్షం కోసం నిర్వహించే ఈ బోనాల వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. డిప్యూటీ సర్పంచ్ డా. దొడల వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ... భక్తులు అధిక సంఖ్యలో హాజరై దేవుడి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు.గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, ప్రజలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్

**- మే 20న దేశవ్యాప్తంగా బంద్**

**- ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ (ఏ ఐ ఓ సి డి) పిలుపునిచ్చాయి**

మంగపేట మే 16 (విజన్ ఆంధ్ర) : మంగపేట మండలం మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 20 మే 2026న దేశవ్యాప్తంగా జరగనున్న బందు గురించి మండల తాసిల్దార్ తోట రవీందర్ మంగపేట సెకండ్ ఎస్సై శ్రీకాంత్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఆన్లైన్లో మందుల అమ్మకాలను వ్యతిరేకిస్తూ మరియు దేశంలో నెలకొన్న పలు అంశాలపై నిరసనగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ (ఏ ఐ ఓ సి డి) ఈ బందుకు పిలుపునిచ్చాయి. దేశవ్యాప్తంగా 12.40 లక్షలకు పైగా మెడికల్ మందుల దుకాణాలు మూతపడే పరిస్థితిలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో మంగపేట మండలం మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, సెక్రటరీ సామల సాంబశివరావు, కోశాధికారి శ్రీనివాసరెడ్డి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా

**- జేఎన్టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల సుల్తాన్‌పూర్‌లో నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం**

**- కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు**



చౌటకూర్ మే 16 ( విజన్ ఆంధ్ర ) :- మండలంలోని పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సైన్స్, సుల్తాన్‌పూర్( జేఎన్టీయూ యూసీఈఎస్, సుల్తాన్‌పూర్ ) ఆధ్వర్యంలో "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది మరియు హౌస్‌కీపింగ్ సిబ్బంది.పిల్లలకు నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు సహాయక సిబ్బంది. పిల్లలకు విద్యాపరమైన ప్రోత్సాహాన్ని అందించడమే కాకుండా, వారి భవిష్యత్ అభివృద్ధికి తోడ్పడతాయని తెలిపారు. కళాశాల నిర్వహణలో అవుట్‌సోర్సింగ్, సెక్యూరిటీ మరియు హౌస్‌కీపింగ్ సిబ్బంది అందిస్తున్న సేవలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రాఘవేంద్ర రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గౌరవ ఉపకులపతి డా. టి. కె. కె. రెడ్డి, ప్రోత్సాహం మరియు విలువైన సహకారంతో నిర్వహించబడింది. సిబ్బంది ,సంక్షేమం, విద్యార్థుల అభివృద్ధి మరియు సామాజిక బాధ్యత కార్యక్రమాల పట్ల ఆయన చూపుతున్న ప్రత్యేక శ్రద్ధనుఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. విశ్వనాథ రాజు, వైస్ ప్రిన్సిపాల్ డా. వై. రాఘువేందర్ రావు, ఉప రిజిస్ట్రార్ కె.ఎస్ ఆర్ సత్య సాయి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది మరియు నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇల్లందు సబ్ జైలు ను సందర్శించిన జడ్జి స్వరూప కాటం..

ఇల్లందు, మే 16(విజన్ ఆంధ్ర) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఈ శనివారంనాడు స్థానిక ఇల్లందు సబ్ జైల్ ను సాయంత్రం ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం సందర్శించి ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచనలు చేశారు. మెనూ ప్రకారం సదుపాయాలు అందుతున్నాయో లేవో ఖైదీలను అడిగి తెలుసుకున్నారు, అనంతరం సబ్ జైల్ పరిసరాలను పరిశీలించినారు, పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్జితో పాటు సబ్ జైల్ లీగల్ ఎయిడ్ న్యాయవాది కీర్తి కార్తిక్, సబ్ జైల్ సూపరిండెంట్ చంద్రశేఖర్, జైలు సిబ్బంది, సాంబ, శాంతి స్వరూప్, భాస్కర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వేగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలి

కుల్కచర్ల, మే 16(విజన్ ఆంధ్ర): వేగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు సూచించారు. మండల కేంద్రమైన కుల్కచర్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు . ఆయన మాట్లాడుతూ...రైతులకు అందుబాటులో గన్ని సంచులు ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని వివరించారు. రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# డ్రైనేజీలు శుభ్రంగా ఉంటేనే డెంగీ నివారణ సాధ్యం

**-దోమలను నివారిద్దాం... డెంగీని అంతం చేద్దాం**

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్**

టేకులపల్లి మే 16 విజన్ ఆంధ్ర : ప్రపంచ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ రామదాస్ ఆధ్వర్యంలో స్థానిక సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన ర్యాలీ, మానవహారం మరియు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ప్రజలకు, వైద్య సిబ్బందికి డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మానవ మరణాలు దోమకాటుతో వ్యాపించే వ్యాధుల వల్ల సంభవిస్తున్నాయని, ఇది అత్యంత ఆందోళనకర విషయమన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, ప్రతి మంగళవారం మరియు శుక్రవారం "డ్రై డే" పాటించడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. గ్రామాల్లో డ్రైనేజీలు, మోరీలు, కాలువల్లో ప్రజలు చెత్తాచెదారం వేయడం వల్ల మురుగునీరు సక్రమంగా ప్రవహించక నీరు నిల్వ ఉండి దోమలు



విపరీతంగా పెరుగుతున్నాయని హెచ్చరించారు. మురుగు కాలువల్లో చెత్త వేయడం ప్రజారోగ్య రక్షణ చట్టం ప్రకారం నేరమని ప్రజలు గమనించాలని కోరారు.ఇంటి వద్ద నీటి ట్యాంకులు, డబ్బాలను మూతలతో మూసి ఉంచాలని, రాత్రి వేళల్లో దోమతెరలు వినియోగించాలని, గృహాలకు దోమజాలీలు అమర్చుకోవాలని సూచించారు. అలాగే పూర్తిగా శరీరాన్ని కప్పే దుస్తులు ధరించడం ద్వారా కూడా దోమకాటును నివారించవచ్చన్నారు. డెంగీ, మలేరియా, బోధకాలు, మెదడు వాపు వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధిక జ్వరం, తలనొప్పి, చలి, వణుకు, ఒళ్లు నొప్పులు, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స పొందాలని సూచించారు.మన సంకల్పం -- డెంగీ రహిత భారత్,మన చర్యలు -- మన రక్షణ,ఆరోగ్యకరమైన కుటుంబం -- సురక్షితమైన సమాజం అనే నినాదాలతో ప్రతి ఒక్కరూ డెంగీ నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ కుమారస్వామి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, సీసీ రాంప్రసాద్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ గన్య, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సబ్ యూనిట్ ఆఫీసర్ జాబిశెట్టి శ్రీనివాస్, సూపర్వైజర్లు గుజ్జా విజయ, కౌసల్య సింగ్, నాగబండి వెంకటేశ్వర్లు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు హారిక, ధరణి, రుక్సానా, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్, ఫార్మసీ ఆఫీసర్ కిరణ్ కుమారి, దనసరి రాంబాబు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కారు, ఇసుక లారీ ఢీ

## ముగ్గురికి తీవ్ర గాయాలు



కాటారం, మే 16 (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం, మహాదేవపూర్ మధ్య జాతీయ రహదారిపై రెండు వాహనాలు ఢీ కొని , ప్రమాదం జరిగింది. కారు, ఇసుక లారీ ఎదురెదురుగా ఢీ కొట్టిన దుర్ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారంగా.. కాటారం మండలంలోని నస్తూరిపల్లి గ్రామ క్రాస్ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కాటారం, మహాదేవపూర్ ప్రధాన రహదారిపై హైదరాబాదుకు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ, కాటారం నుంచి మహాదేవపూర్ వైపునకు వెళుతున్న మారుతి సుజుకి ఫ్రాంక్స్ కారు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. అదుపుతప్పి బలంగా ఢీకొన్నట్లు సమాచారం. కాగా, ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. గాయపడిన వారు రేగొండ మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. సబ్బిడి సురేందర్ రెడ్డి (42), కారు డ్రైవర్, యజమాని సబ్బిడి కిరణ్ రెడ్డి (27), సబ్బిడి రవీందర్ రెడ్డి (60)లకు తీవ్ర గాయాలయ్యాయని వారు తెలిపారు. క్షత గాత్రులను వెంటనే అంబులెన్స్ ద్వారా ముందుగా మహాదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అన్అదిన్నంచిన్త అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం కు తరలించినట్లు సమాచారం. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని పోలీసులు సమీక్షిస్తున్నారు. కేసు నమోదు చేసికొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటుపై హర్షం

మల్హర్, మే16 విజన్ ఆంధ్ర : తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయడంపై మల్హార్ రావు మండల తెలంగాణ ఉద్యమకారుడు టియూఎఫ్ ఫోరం భూపాలపల్లి జిల్లా ప్రదాన కార్యదర్శి ముడితనపెల్లి ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిజమైన ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు చొరవ చూపిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్‌గా నియమితులైన కమిటీ చైర్మన్ కె. కేశవరావు, సభ్యులు పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కమిటీతో క్షేత్రస్థాయి ఉద్యమకారులకు త్వరలోనే పూర్తి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ నాయకత్వంలో గత 9 ఏళ్లుగా చేసిన నిరంతర పోరాటాలు, అనేక వినతుల ఫలితంగానే ఈ కమిటీ ఏర్పాటైందని, అందుకు ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలి

## - చించోడు పీహెచ్‌సీలో కార్యక్రమం నిర్వహణ

షాద్ నగర్, విజన్ ఆంధ్రా మే16 : ఫరూక్‌నగర్ మండలంలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంఎల్‌హెచ్‌పి వైద్యాధికారి డాక్టర్ సంధ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు డెంగ్యూ వ్యాధి నివారణ, దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీని చించోడు గ్రామంలో కొనసాగించారు. డెంగ్యూ నివారణే రక్షణ, నీరు నిల్వ ఉండనివ్వొద్దు, దోమలను అరికడదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం వంటి నినాదాలతో గ్రామ ప్రజలను చైతన్యపరిచారు.




ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు మాట్లాడుతూ...డెంగ్యూ ఒక ప్రమాదకర వైరల్ జ్వరమని,ఇది ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు.అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి,కళ్ల వెనుక నొప్పి, శరీర నొప్పులు, వాంతులు, చర్మంపై ఎర్రటి మచ్చలు వంటి లక్షణాలు కనిపిస్తాయని చెప్పారు. కొన్ని సందర్భాల్లో డెంగ్యూ ప్రాణాపాయం కూడా కలిగించవచ్చని హెచ్చరించారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి ట్యాంకులు, పాత్రలకు మూతలు వేయాలని, పాత టైర్లు, కొబ్బరి చెక్కలు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.గ్రామాల్లో పరిశుభ్రత పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. డెంగ్యూపై అవగాహన పెంచుదాం.దోమల పెరుగుదలను అరికడదాం.ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ప్రవీణ్, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ, ఏఎన్ఎంలు లలిత, మధువాణి, హాస్పిటల్ సిబ్బంది శ్రీనివాసులు, మణెమ్మ, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బోనాలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం

## భక్తి, సంస్కృతి, గ్రామీణ ఐక్యతకు ప్రతీకగా బొడ్రాయి వేడుకలు

షాద్ నగర్, విజన్ ఆంధ్రా మే16: తెలంగాణ అంటే గుర్తొచ్చే తొలి సంస్కృతిక ప్రతీకల్లో బోనాలు ఒకటి. గ్రామ దేవతల పట్ల ప్రజల విశ్వాసం, భక్తి, గ్రామీణ జీవన విధానం, సామాజిక ఐక్యత అన్నీ కలగలిపిన మహోత్సవమే బోనాలు. ముఖ్యంగా గ్రామాల్లో నిర్వహించే బొడ్రాయి బోనాలు కేవలం పండుగ మాత్రమే కాదు తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాల ప్రతిబింబం.వెలి జర్ల వంటి గ్రామాల్లో బొడ్రాయి బోనాల వేడుకలు ప్రారంభమయ్యాయంటే గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోతుంది. దేవాలయాల శుభ్రత, ప్రత్యేక అలంకరణలు, పూజా ఏర్పాట్లు, గ్రామ పెద్దల సమావేశాలు, యువత భాగస్వామ్యం ప్రతి అంశం ఒక ఉత్సవ వాతావరణాన్ని సృష్టిస్తుంది.

లిబోనం వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావనలి

“బోనం” అనే పదం “భోజనం” నుంచి వచ్చినదిగా పెద్దలు చెబుతారు. అమ్మవారికి అన్నపూర్ణ రూపంలో నైవేద్యం సమర్పించడం ద్వారా గ్రామానికి శాంతి, సుభిక్షం కలగాలని ప్రజలు ప్రార్థిస్తారు. గతంలో గ్రామాల్లో వ్యాధులు, అంటురోగాలు విస్తరించినప్పుడు ప్రజలు గ్రామ దేవతలను ప్రార్థిస్తూ బోనాలు నిర్వహించేవారు. ఆ తర్వాత అది ఒక సంప్రదాయ పండుగగా మారింది.బోనం తీసుకెళ్లే మహిళలు సంప్రదాయ దుస్తుల్లో, తలపై అలంకరించిన బోనాలతో దేవాలయాలకు వెళ్లడం తెలంగాణ సంస్కృతిలో ప్రత్యేక దృశ్యంగా నిలిచింది. డప్పుల శబ్దాలు, పోతురాజు విన్యాసాలు, భక్తుల జైకారాలతో గ్రామమంతా పండుగ వాతావరణంలో మునిగిపోతుంది.

లిగ్రామ దేవతల పట్ల ప్రజల విశ్వాసంలి

గ్రామాల్లో బొడ్రాయి, పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, నాగులమ్మ వంటి గ్రామ దేవతలను ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ప్రతి దేవత వెనుక గ్రామ ప్రజల నమ్మకాలు, జీవన విధానం దాగి ఉంటుంది. గ్రామాన్ని కష్టాల నుంచి కాపాడేది గ్రామ దేవతలేనన్ విశ్వాసం ప్రజల్లో



బలంగా ఉంటుంది.అందుకే బోనాల సందర్భంగా శివాలయం, రామాలయం, శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, ధ్వజస్తంభం, నవగ్రహాలు, నాగులు తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిగే ఈ పూజలు గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొస్తాయి.

లిబోనాలు... గ్రామీణ ఐక్యతకు ప్రతీకలి

ఇప్పటి సమాజంలో మనుషుల మధ్య దూరాలు పెరుగుతున్నాయనే అభిప్రాయం తరచూ వినిపిస్తోంది. కానీ గ్రామాల్లో జరిగే బోనాల వంటి పండుగలు మాత్రం ప్రజలను ఒక్కటిగా నిలబెడుతున్నాయి. కులాలు, వర్గాలు, రాజకీయ భేదాలు పక్కనపెట్టి గ్రామ ప్రజలు ఒకే చోట చేరి పండుగను నిర్వహించడం గొప్ప విషయం.పండుగ ఏర్పాట్లలో యువత నుంచి వృద్ధుల వరకు అందరూ పాల్గొంటారు. మహిళలు బోనాలు సిద్ధం చేస్తే... యువకులు దేవాలయాల అలంకరణ, ఊరేగింపుల ఏర్పాట్లు చేపడతారు. గ్రామ పెద్దలు పూజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. ఈ సమిష్టి భాగస్వామ్యమే గ్రామీణ ఐక్యతకు అసలు నిదర్శనం.

లికొత్త తరానికి సంప్రదాయాల పాఠంలి

ప్రస్తుతం సాంకేతిక యుగంలో యువత ఎక్కువగా ఆధునిక జీవనశైలికి అలవాటు పడుతోంది. ఇలాంటి సమయంలో బోనాల వంటి పండుగలు కొత్త తరానికి మన సంప్రదాయాల విలువను గుర్తు చేస్తున్నాయి. గ్రామ సంస్కృతి, ఆచారాలు, పండుగల ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేయడంలో పెద్దలు కీలక పాత్ర పోషించాలి.పండుగల ద్వారా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజలు కలుసుకోవడం జరుగుతుంది. దీంతో ఆత్మీయత పెరుగుతుంది. ఒకరికొకరు సహాయం చేసుకునే భావన బలపడుతుంది.

లిసంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యతలి

పాశ్చాత్య సంస్కృతి ప్రభావం పెరుగుతున్న ఈ రోజుల్లో మన సంప్రదాయాలను కాపాడుకోవడం అత్యంత అవసరం. బోనాలు వంటి పండుగలు కేవలం ఆచారాలుగా కాకుండా మన చరిత్రను, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించే వారసత్వంగా భావించాలి.

గ్రామాల్లో జరుగుతున్న బోనాల వేడుకలు తెలంగాణ సంస్కృతి సజీవంగా ఉందనడానికి నిదర్శనం. ప్రజల విశ్వాసం, భక్తి, ఐక్యత ఉన్నంత కాలం ఈ సంప్రదాయాలు చిరస్థాయిగా నిలుస్తాయి.

లిభక్తి, భద్రత, భవిష్యత్తు కోసం ప్రార్థనలులి

ప్రతి గ్రామంలో బోనాలు నిర్వహించడంలో ఒక సామూహిక సంకల్పం దాగి ఉంటుంది. గ్రామం సుఖశాంతులతో ఉండాలి... ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి... పంటలు బాగా పండాలి... ప్రతి ఇంట్లో ఆనందం నిండాలి అనే ఆకాంక్షతో ప్రజలు అమ్మవారిని ప్రార్థిస్తారు.అందుకే బోనాలు కేవలం పండుగ కాదు... అది తెలంగాణ ఆత్మ. గ్రామీణ సంస్కృతికి జీవం. ప్రజల విశ్వాసానికి ప్రతిబింబం. భక్తి, బంధం, సంస్కృతిని కలిపే ఆధ్యాత్మిక మహోత్సవం.

చౌటకూర్: ఐకెపి సెంటర్ పర్యవేక్షణలో లోపం

# రైతులు ఆందోళన

## - స్పెషల్ బ్రాంచ్ పోలీస్ బృందం తనిఖీలు

చౌటకూర్ మే 16 ( విజన్ ఆంధ్ర ) పరిధిలోని వివిధ గ్రామాలలో ఐకెపి సెంటర్‌లలో సెంటర్ ఏజెంట్‌లు లేకుండానే అకస్మిక తనిఖీలు నిర్వహించగా అధికారుల బృందం అక్కడ ఎవరు కనిపించారో లేదని నమోదు చేసి వెళ్లిన సంఘటనతో రైతుల్లో ఆందోళన వచ్చింది. స్పెషల్ బ్రాంచ్ పోలీస్ బృందం తనిఖీలు చేసినప్పుడు సెంటర్‌ల వద్ద లేకపోవడంతో పనితీరు, పర్యవేక్షణపై ప్రశ్నలు వచ్చాయి.

రైతులు పేర్కొన్నట్టు సెంటర్లలో వరి తాళ్ల మిషిన్ పయోగం తగిన శ్రేణిలో ఉండకపోవడం, మిశిన్లని షెడ్‌లో నిల్వ చేయ్యకపోవడంతో ఎండలోనే ఉంచడం, అవసరం ఉన్నప్పుడు మాత్రమే వినియోగించడం వంటి సాధన వినియోగ మార్పులు ఉంటున్నాయి. ఈ పరిస్థితుల్లో మిషన్ల సంరక్షణ మరియు సముచిత వినియోగం లేకపోవడం వల్ల పరికరాలపై పట్టింపులు లేదా నిర్వహణ లేదు అన్న అభియోగం వారు తెలిపారు.

సీరియల్ ప్రకారం ధాన్యాల నిల్వల సరళీకరణలో కూడా ఇబ్బందులు ఉన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీరియల్ నెంబర్లు ఇచ్చినా, వాటి ప్రకారం వరి ధాన్యం ఉంచే విధానాన్ని పాటించకుండా, తమ పరిచయస్థులకు ముందుగానే జరుగుతోంది అని వారు గమనించారు.

సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేసి సెంటర్‌లలో ఏజెంట్‌ల నియామకం, మిషన్‌ల సరైన నిల్వ మరియు నిర్వహణ, ధాన్యాల నమోదు విధానాలపై కచ్చితమైన పర్యవేక్షణను అమలు చేయాలి అన్నంతరం. స్థానిక పంచాయతీ మరియు జిల్లా వ్యవసాయ విభాగం సహాయక చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# మిల్లులలో నిర్దేశించిన లక్ష్యం అనుగుణంగా ధాన్యాన్ని తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలి

హుస్నాబాద్ : మిల్లులలో నిర్దేశించిన లక్ష్యం అనుగుణంగా ధాన్యాన్ని తప్పనిసరిగా దిగుమతి చేసుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. ఈ సందర్భంగా శనివారం రోజున హుస్నాబాద్ మండలంలోనీ పందిళ్ళ గ్రామంలోనీ షణ్ముఖ ఇండస్ట్రీస్, గౌరీ శంకర్ ఆగ్రో ఇండస్ట్రీస్, పవన సుత ఇండస్ట్రీస్ లలో ధాన్యం దిగుమతి ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతుందని దిగుమతి చేసే ప్రతి మిల్లుకు నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ధాన్యం దిగుమతి జరగాలని తెలిపారు. అకాల వర్షాలు పడితే ధాన్యం తడిసి పోతుందనే ఒకే ఒక కారణంగా ధాన్యాన్ని స్థానికంగా అందుబాటులో ఉన్న ట్రాక్టర్ మరియు ఇతర వాహనాలలో పంపించడం జరుగుతుందని మిల్లర్ యజమానులు సహకరించాలని ఆదేశించారు. దిగుమతిలో జాప్యం కాకుండా ఎక్కువమంది హమాలీలను అందుబాటులో ఉంచి షిఫ్ట్ లా వారిగా పని చేయించాలని ఆదేశించారు. గ్రామాల్లో స్థానికంగా పని చేసే హమాలీలను సమకూర్చుకుని ఎక్కడ కొనుగోలు కేంద్రాల్లో అక్కడ హమాలీలు పనిచేస్తే మిల్లులో దిగుమతికి ఆలస్యం కాదని ఈ బాధ్యతను స్థానిక తహసీల్దార్ చూసుకోవాలని ఆదేశించారు. ధాన్యం దిగుమతి కాగానే మిల్లర్ అక్నాలజ్మెంట్, ట్రక్ షిట్ జెనరేట్, ఓపిఎంఎస్ అప్లోడ్ పెండింగ్ ఉంచకుండా వెంటనే పూర్తి చెయ్యాలని ఆదేశించారు. దిగుమతిలో జాప్యం కాకుండా రెవెన్యూ అధికారులను నియమించినట్లు వేగంగా దిగుమతి చెయ్యాలని ఆదేశించారు. కె కలెక్టర్ వెంట ఆర్డీఓ రామ్మూర్తి, ఏసిపి సదానందం, తహసిల్దార్ లక్ష్మా రెడ్డి తదితరులు ఉ



న్నారు.

**హుస్నాబాద్ కొత్తపల్లి నాలుగు వరుసల రహదారి పరిశీలన**

హుస్నాబాద్ నుండి కొత్తపల్లి వరకు 77.20కోట్లతో నాలుగు వరసల రోడ్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కె హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోడ్ వెంబడి చెట్లు కటింగ్, పొదల తొలగింపు ప్రక్రియ దాదాపు పూర్తి అయిందని ఎలక్ట్రిక్ స్తంభాల షిఫ్టింగ్ పనులు సైతం వేగంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్ జాయింట్ పర్యవేక్షణ చేసి మున్సిపల్ ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న చెట్లు కటింగ్, మార్కింగ్ చేసిన వరకు నివాసాలను తొలగించే ప్రక్రియ పూర్తి చెయ్యాలని ఆదేశించారు. రోడ్ పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలోపు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు.

# పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి

భువనగిరి మే 16( విజన్ ఆంధ్ర ) : పెట్రోల్,డీజిల్,గ్యాస్ లపై కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను ఉపసంహరించుకోని, జీఎస్టీ పరిధిలోకి వాటిని తేవాలి అని సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు.

సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రైతు బజార్ వద్ద కేంద్ర ప్రభుత్వంపై నిరసన కార్యక్రమం నిర్వహించినారు. ఇప్పటికే యుద్ధం పేరుతో నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగినవి అని సామాన్యులు, ఉద్యోగస్తులు, పేదలు కేంద్ర ప్రభుత్వము ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తూ ఉన్నది, ధరలకు అనుకూలంగా రోజువారి



కూలీలు జీతాలు పెరగడం లేదు అని అదేవిధంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెరగడంతో మరింత ధరలు పెరిగే అవకాశాలు ఉన్నందున వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఐ ఎం పట్టణ కమిటీ డిమాండ్ చేస్తుంది అని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగి పది రోజులలో ధరలు పెంచడం ప్రజల్ని మభ్య పెట్టడమే తప్ప ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదు అని అన్నారు. పెంచిన ధరలు ఉపసంహరించుకోకుంటే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిపిఐఎం కార్యవర్గ సభ్యులు బందల ఎల్లయ్య,వనం రాజు కమిటీ సభ్యులు వల్లాస్ అంజయ్య,చింతల శివ, ఈర్ల రాహుల్,జూకంటి పావుల్,జగ్గులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలి

**-.పెంచిన పెట్రోల్ డిజిల్ ధరలను వెంటనే తగ్గించాలి**

**-వడ్ల కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు**

**-ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

భువనగిరి మే 16( విజన్ ఆంధ్ర ) : పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం వరుసగా పెంచడం వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు.

శనివారం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమం కార్యక్రమం లో ఎమ్మెల్సీ సత్యం పాల్గొన్నారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, పెట్రోల్ మరియు డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు మరింత పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధానాలు అవలంబిస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతోందని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథకు సంబంధించిన అంశంపై కూడా స్పందిస్తూ అధికారంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. చట్టం అందరికీ సమానంగా అమలుకావాలని, రాజకీయ ప్రభావంతో



ఎవరూ తప్పించుకోరాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయం, పారదర్శకత కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వడ్ల కొనుగోలు ప్రక్రియలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేకపోవడం, ధాన్యం తూకాల్లో ఆలస్యం, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడం, చెల్లింపులు సకాలంలో చేయకపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతులు అప్పులు చేసి, అధిక ఖర్చులతో పంటలు పండించినప్పటికీ, ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో విఫలమైందన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోతుండగా, కొనుగోలు కేంద్రాల్లో తగిన టార్పాలిన్లు, గోదాములు, త్రాగునీరు, విశ్రాంతి సదుపాయాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, మద్దతు ధర పూర్తిగా అమలు చేయాలని, ధాన్యం కొనుగోళ్లలో మధ్యవర్తుల జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు చెల్లింపులు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత పాటించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, రైతులను ఇబ్బంది పెట్టే అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. రైతాంగాన్ని ఆదుకునే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నిరుద్యోగం, కార్మికుల ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు.

గాదేగాని మాణిక్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, బచ్చనగోని గాలయ్య, చేక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, యేశాల అశోక్, జిల్లా సమితి సభ్యులు కళ్ళేపల్లి మహేందర్, సోమన సబిత, అన్నెపు వెంకట్, మరుపాక వెంకటేష్, అన్నేమైన వెంకటేష్, ఇంజ హేమలత, చాపల అంజయ్య, కలకొండ సంజీవ, దాసరి లక్ష్మయ్య, బబ్బురి శ్రీధర్, మూల పోచయ్య,

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన ఎమ్మెల్యే కుంభం

భువనగిరి మే 16( విజన్ ఆంధ్ర) భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన భూనిర్వాసితులకి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి నిధులు విడుదలను చేయాలని కోరుతూ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు ని కలసి వినతిపత్రం అందజేసినారు. రైతులకు సకాలంలో నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేసినారు.

## పార్లమెంట్‌లో మహిళా బిల్లును ఆమోదించాలి

**- పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టిన కాంగ్రెస్**

**- టిపిసిసి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుగుణ**

కాటారం, మే 16 (విజన్ ఆంధ్ర): మహిళా బిల్లును ఆమోదించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో మహిళా బిల్లును ప్రవేశపెట్టి వెంటనే ఆమోదింప చేయాలని టిపిసిసి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు ఆంగోత్ సుగుణ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏఐసీసీ పిలుపు మేరకు మహిళా బిల్లును వెంటనే పాస్ చేయాలని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పంతకాని తిరుమలతో కలిసి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. కాటారం గ్రామంలోని దుబ్బగూడెం, గంట గూడెం, జీయర్ వాడల్లో మహిళలందరిని కలిసి పోస్ట్ కార్డులు అందించి నరేంద్ర మోడీకి చేరేలా పోస్ట్ చేయాలని కోరారు. ప్రధానమంత్రి మోడీ కి మహిళా బిల్లు పట్ల చిత్తశుద్ధి లేకపోవడంతోనే బిల్లు పాస్ కావడం లేదని ఈ సందర్భంగా అన్నారు. మహిళలను చిన్నచూపు చూస్తున్న బిజెపి ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో మహిళలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మహిళా నాయకురాళ్ళు దొంగిరి లక్ష్మి, బీరెల్లి సమ్మక్క, జీయర్ రజిత, కొండగొర్ల సమ్మక్క, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



## వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

**- డెంగ్యూ నివారణకై ర్యాలీ**

**- వైద్యాధికారిని డాక్టర్ మౌనిక**

కాటారం, మే 16 (విజన్ ఆంధ్ర) : జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా కాటారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి డాక్టర్ మంతెన మౌనిక మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధిని ఓడించేందుకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. డెంగ్యూ వ్యాధి ఏడిస్ ఈజిప్ట్ దోమ కుట్టడం వలన వస్తుందని, ఇది చికెన్ గున్యా కన్నా ఎక్కువగా ఒంట్లో శక్తిని హరించే వ్యాదని వివరించారు. ఈ వ్యాధి వచ్చినప్పుడు తీవ్రమైన జ్వరం, శరీరం పై ఎర్రని దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి ఉంటుందని వ్యాధి లక్షణాలను సోదాహరణంగా పేర్కొన్నారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే దగ్గరలో గల ఆరోగ్య కేంద్రాన్ని గాని, ఆరోగ్య ఆరోగ్య కార్యకర్తలను గాని, ఆశా కార్యకర్తలను గాని సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి నివారణకై ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టుపక్కల ప్రాంతంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కోరారు. నీరు నిల్వ లేకుండా గుంతలను మట్టితో పూడ్చి వేసి, నీరు పారే విధంగా డ్రైనేజీలను ఏర్పాటు చేసుకొని దోమలు వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. ముఖ్యంగా దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి శుక్ర, మంగళవారం ప్రజలందరూ విధిగా డ్రైడే పాటించాలని కోరారు. తాగి పారేసిన కొబ్బరి బొండాలను ముక్కలుగా చేసి చెత్తకుండీలో వేయాలన్నారు. వాడిన పాత టైర్లు, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ కప్పులు ఇంటి పరిసరాలలో నీరు నిల్వ కాకుండా చూసుకోవాలని సూచించారు. దోమలు ఇంటి లోపలికి రాకుండా జాలీలు ఏర్పాటు చేసుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని అన్నారు. దోమలను నివారించుటకు వేపాకు పొగ పెట్టాలన్నారు. దోమలు కుట్టకుండా పగటిపూట పొడుగు చేతుల కలిగిన చొక్కా, పైజామా ప్యాంటు, పంచే మొదలగు దుస్తులను శరీరం కప్పి ఉండే విధంగా ధరించాలన్నారు. పాదాలకు బూట్లు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ ఎం మౌనిక తో పాటు మహిళా హెల్త్ సూపర్వైజర్ సరళ, మహిళా హెల్త్ అసిస్టెంట్లు సి హెచ్ సరోజన, జాడి శ్యామల, ఫార్మసిస్టు రసియా, ఆశా కార్యకర్తలు పద్మ, లత, సమ్మక్క, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన సదస్సు

కోహెడ విజన్ ఆంధ్ర మే 16: : కోహెడ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ పరిశోధన స్థానం,తోర్నాల శాస్త్రవేత్తలు,వ్యవసాయ శాఖ సహకారంతో రానున్న వానాకాలం సాగుకై రైతులను సమాయత్తం చేయడం కోసం మెరుగైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సంతోష్,స్పందన మాట్లాడుతూ రైతు సోదరులకు పంట పొలాల్లో రసాయన ఎరువులు పురుగు మందుల వాడకం తగ్గించాలని,సమగ్ర యాజమాన్య పద్ధతులు పాట్టించాలని,నేల సంరక్షణకు పచ్చి రొట్టె ఎరువులు జనుము, జీలుగా,పెసర పంటను వేసవి కాలం లో వరి పంటకు ముందు సాగు చేస్కోవడం,యూరియా వాడకం తగ్గించాలని,జీవన ఎరువులు,పిఎస్ బి వినియోగం లింగాకర్షక బుట్టలు,జిగురు అట్టల ఉపయోగం ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి వివరించారు. అలాగే వివిధ వరి రకాలు కేఎన్ఎం-1638,ఆర్ఎన్ఆర్ -15048,బిపిటి-5204, డబ్ల్యూజిఎల్-44 సాగు అనుగుణం అని,వివిధ పంటలో యూరియా మోతాదు,రైతులు విత్తనాలు కొన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,వివిధ పంటల్లో సాగునీటిని ఆదా లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. తరువాత మండల వ్యవసాయ అధికారి సతీష్ మాట్లాడుతూ రైతులు శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటిస్తే పెట్టుబడి ఖర్చు తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నాయిని నవీన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**- రక్తదాన శిబిరం నిర్వహణ.. పలు సేవా కార్యక్రమాలు**

**- ఎన్ఎన్ఆర్ యువసేన సేవా కార్యక్రమాలకు ప్రశంసలు**

**- ప్రజా సంక్షేమానికి చూపుతున్న కార్యదక్షిత ఆదర్శనీయం**

**- నవీన్ రెడ్డి జన్మదిన వేడుకలకు భారీగా తరలివచ్చిన అభిమానులు**

ఇబ్రహీంపట్నం, మే 16 (విజన్ ఆంధ్ర ): ఎన్ఎన్ఆర్ వ్యవస్థాపకులు నాయిని నవీన్ రెడ్డి (ఎన్ఎన్ఆర్) జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని యాచారం మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్స్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొని 34 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నాయిని నవీన్ రెడ్డి మాట్లాడుతూ... తమ జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. పేద విద్యార్థులకు చేయూత, క్రీడా టోర్నమెంట్లు, రక్తదాన శిబిరాలు, గ్రామాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజ సేవలో ముందుండాలని యువతకు పిలుపునిచ్చారు. చౌదర్పల్లి గ్రామాభివృద్ధి కోసం సీసీ కెమెరాల ఏర్పాటు, మంచినీటి సౌకర్యం, అవసరమైన కుటుంబాలకు ఆర్థిక సాయం, సేవా కార్యక్రమాలు తదితర కార్యక్రమాలను ఎన్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నట్లు నాయకులు తెలిపారు. కష్టాల్లో, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఎన్ఎన్ఆర్ యువసేన చేదోడు,వాదోడుగా ఉంటుందని తెలిపారు. తమ యువసేన ద్వారా పలు రకాల సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. పేద



కుటుంబాలకు చేయూత నివ్వడంలో ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. తమ సంపాదనలో సగభాగం పేదవారికి ఖర్చు చేయడమే నిజమైన సంతృప్తి అన్నారు. చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలకు ఎన్ఎన్ఆర్ యువసేన అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఎన్ఎన్ఆర్ యువసేన నాయకులు మద్దూరి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు ఎంఎన్ఆర్ యువసేన నాయకులు, సభ్యులు, నవీన్ రెడ్డి కుటుంబ సభ్యులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జన్మదిన వేడుకల్లో ప్రముఖ మిమిక్రీ యాంకర్ శివారెడ్డి, తమ కళా బృందం పాల్గొని నవీన్ రెడ్డి జన్మదిన అభిమానాన్ని చాటారు.

ఇబ్రాహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో వేడుకలు

ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఎన్ఎన్ఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు నవీన్ రెడ్డి జన్మదిన వేడుకలు నూతనగంటి పురుషోత్తం, మద్దూరి క్రిష్ణారెడ్డిల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయనతో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించి, గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నవీన్ రెడ్డి ప్రజా సంక్షేమానికి చూపుతున్న కార్యదక్షిత ఆదర్శనీయమని పలువురు పేర్కొన్నారు. భవిష్యత్తులో నవీన్ రెడ్డి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, పేద ప్రజలకు బాసటగా నిలవాలని ఆకాంక్షించారు. నవీన్ రెడ్డి ఆయుష్,ఆరోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. నవీన్ రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుండాలని పలువురు నాయకులు, అభిమానులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎన్ఆర్ యువసేన నాయకులు విష్ణు రెడ్డి, బోడ సామెల్, స్వీట్ హౌస్ మల్లేష్, నూతనగంటి రాజేష్, పంది రమేష్, పంది ఆనంద్, పంది యాదగిరి, తీర్మల్ బిక్షపతి, రెడిమళ్ల వంశీ, నూతనగంటి రవితేజ, రాజిరెడ్డి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భవిష్యత్తులో ఏఐదే కీలకపాత్ర

## - డాక్టర్ కాంపల్లి శంకర్



బూర్గంపాడు మండల ప్రతినిధి మార్చ్ 4 (విజన్ ఆంధ్ర) : ధర్మ జాగరణ సమితి వారి ఆధ్వర్యంలో శ్రీ రాములోరి పెళ్లికి గోటి తలంబ్రాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక రాజీవ్ నగర్ కాలనీ నందు శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో గోటి తలంబ్రాలు తీసి శ్రీ అభయంజయ స్వామి దేవాలయం నుండి శ్రీరామ్ భక్తులందరూ పాదయాత్ర చేసుకుంటూ భద్రాచలంలో గల సీతారామ స్వామి దేవాలయం వెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయ స్వామి సుబ్రహ్మణ్యేశ్వర ఆధ్వర్యంలో చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సత్యనారాయణ పాపిరెడ్డి ఈశ్వరరావు ముత్యాలరావు రాజేశ్వరరావు శ్రీనివాసరావు రాజేష్ పాల్గొనడం జరిగింది

# గ్రామంలో ఆడపిల్ల వివాహానికి రూ.5000 ఆర్థిక సహాయం

## - సర్పంచ్ గొల్ల మల్లేశం



చౌటకూర్ మే 16 ( విజన్ ఆంధ్ర ) చౌటకూరు మండలంలోని పరిధిలోని ఉప్పరగూడెం ఈరోజు గ్రామానికి చెందిన అల్వాలా సాయిలు కుమార్తె వివాహానికి రూ.5000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. గ్రామంలోని ఏ ఆడపిల్లకైనా వివాహ సమయంలో ఆర్థిక సహాయం అందించినట్టు హామీ ఇచ్చిన భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాత సర్పంచ్ గొల్ల మల్లేశం,మండలకాంగ్రెస్ పార్టీ సలహాదారులు మండల శివకుమార్, అభిలాష్, మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

### మద్యం మత్తులో ఈతకు వెళ్లి ప్రమాదం మంజీర వాగులో

# వ్యక్తి గల్లంతు..

చౌటకూర్ మే 16 ( విజన్ ఆంధ్ర) :- చౌటకూర్ మండల పరిధిలోని శివంపేట సమీపంలోని మంజీర నది వాగులో ఓ వ్యక్తి గల్లంతైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం, మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తి వాగులో ఈతకు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది.

గల్లంతైన వ్యక్తి సంగారెడ్డి పట్టణానికి చెందినవాడిగా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనను గమనించిన గ్రామస్థులు వెంటనే పుల్కల్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలిస్తూ వివరాలు ఆరా తీస్తున్నారు.

అలాగే గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

## తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 16 (విజన్ ఆంధ్ర ): దేశవ్యాప్తంగా శుక్రవారం నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ పై రూ. 3 రూపాయలు పెంచడం అత్యంత దారుణమని పెద్ద అంబర్పేట్ మున్సిపల్ 16వ వార్డు తట్టి అన్నారం తాజా మాజీ కౌన్సిలర్ దేవిడి గీత వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు ఒక ప్రకటనలో మాట్లాడుతూ... ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న తరుణంలో తిరిగి ఒక్కసారిగా పెట్రోల్, డీజిల్ పై లీటరుకు మూడు రూపాయలు అదనంగా పెంచి, కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరిచిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరుగుతున్న రాబోయే రోజుల్లో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఏమాత్రం పెంచబోమని ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రధాన నరేంద్రమోడీ మాట ఇచ్చారని, మరి ఇప్పుడు ఓట్ల కోసం కల్లబొల్లి కబుర్లు చెప్పి ఎన్నికల ముగిసి మూడు వారాలైనా కాకనే ఒక్కసారిగా పెట్రోల్ డీజిల్ పై అధిక ధరలు పెంచి దేశ ప్రజలను మోసగించడం తగదన్నారు. పెట్రోల్, డీజిల్ పెరగటం వల్ల నిత్యవసర సరుకులు కూడా పెరిగే అవకాశం ఉందని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచడం వల్ల సామాన్య ప్రజలు నానా ఇబ్బందులూ పడుతున్నారని వాపోయారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.

# శాస్త్రవేత్తల సూచనలతో రైతులకు నూతన దిశ

- ఎరువుల వినియోగంపై శాస్త్రీయ అవగాహన
- బుచాన్‌పల్లిలో రైతులకు శాస్త్రవేత్తల మార్గదర్శనం



మర్పల్లి, మే 16 (విజన్ ఆంధ్ర) ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండలంలోని బుచాన్‌పల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ పద్మజ హాజరై రైతులకు పంటల సాగు, ఎరువుల వినియోగం, పురుగుమందుల నిర్వహణ, నేల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. విచక్షణారహితంగా యూరియా వినియోగాన్ని తగ్గించి, మట్టి పరీక్షల ఆధారంగా మాత్రమే ఎరువులు వినియోగించాలని సూచించారు. సమతుల్య ఎరువుల వాడకం, సమీకృత సస్యరక్షణ పద్ధతులు, ఆధునిక సాగు విధానాలపై రైతులకు వివరించారు. నానో యూరియా వినియోగం, నీటి పొదుపు చర్యలపై కూడా అవగాహన కల్పించారు. యూరియా కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడానికి రూపొందించిన ఫర్టిలైజర్ యాప్ వినియోగంపై అధికారులు రైతులకు వివరించారు. ఈ యాప్ ద్వారా యూరియా లభ్యత, ధరలు, సమీప ఎరువుల దుకాణాల వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్, హార్టీ కల్చర్ అధికారి ఆక్షితా రెడ్డి సర్పంచ్ , వెంకట్రాం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రవీందర్, ఉపసర్పంచ్ షకీలుద్దీన్, గుర్రం గట్టు సర్పంచ్ రాజు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్, ఏ ఈ వో నీరజ, వినయ్, ప్రశాంత్, మహేష్, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జిట్టా సునీల్ కుమార్ పాదయాత్ర లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బండి రమేష్



కూకట్ పల్లి (విజన్ ఆంధ్ర) మే 16: కైతలాపూర్ డివిజన్ కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అంజయ్య నగర్ ,శ్రీహరి నగర్, ప్రగతి నగర్ ,లో పాదయాత్ర నిర్వహించారు ఈ పాదయాత్రలో పిసిసి వైస్ ప్రెసిడెంట్ కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ,కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర చేశారు. కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. అంజయ్య నగర్ లో పార్కులు అభివృద్ధి, తాగునీరు ,కమిటీ హాల్ ,రోడ్లపై అక్రమ పార్కింగ్ ,ట్రాఫిక్ మరియు ముఖ్యంగా యువత పార్కుల్లో వీధుల్లో గంజాయి మందు విక్రయాలపై శాంతి భద్రత గురించి స్థానికులు తెలియజేశారు,పవన్ నగర్ లో పార్క్ ఫెన్సింగ్ మరియు చిల్డ్రన్స్ పార్క్,శ్రీహరి నగర్ లో రోడ్డు మధ్యలో వాహనాలు ఉండటం తరచూ ఆక్సిడెంట్లు కావడంతో రోడ్డు డివైడర్ కొరకు స్థానికులు తెలియజేయడం జరిగింది, ప్రగతి నగర్ నుంచి వసుంధర వెళ్లే దారిలో తరచుగా ట్రాఫిక్ సమస్యపై చెప్పడం జరిగింది దీనికి నాలాపై రాంప్ కొరకు స్థానికులు తెలియజేశారు. దీనిపై బండి రమేష్ స్పందిస్తూ వెంటనే అధికారులతో మాట్లాడి త్వరలో అన్ని సమస్యలు పూర్తి అయ్యేటట్టు చూస్తామని హామీ ఇచ్చారు.ఈ యొక్క కార్యక్రమంలో కూకట్ పల్లి మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, తుమ్ వేణు,కర్క పెంటయ్య,సురేష్ యాదవ్,ప్రకాష్,మోయిన్,తూమ్ మనోజ్,సలీం ,శంకర్, సుశీల్ యాదవ్, బాలరాజ్ ,అక్బర్ ,మహేష్ మరియు స్థానిక నాయకులు,కాలనీవాసులు పాల్గొన్నారు.

న్యూ ఢిల్లీలోని హోటల్ అశోక్‌లో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ గారి కుమారుడి వివాహ రిసెప్షన్ కు హాజరై వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు.



# పెట్రోల్, డీజిల్ తగ్గించాలని సీపీఐ(ఎం) నిరసన

**సీపీఐ(ఎం ) మంచాల మండల కార్యదర్శి రావుల జంగయ్య**



ఇబ్రహీంపట్నం, మే 16 (విజన్ ఆంధ్ర ) : పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ(ఎం) మంచాల మండల కార్యదర్శి రావుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం మంచాల మండల కేంద్రంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ఇంధనం ధరలు వెంటనే తగ్గించాలని కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి రావుల జంగయ్య మాట్లాడుతూ... మొన్న జరిగినటువంటి ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు అయిపోగానే కేంద్ర ప్రభుత్వం వెంటనే డీజిల్, పెట్రోల్ ధరలు పెంచడం జరిగిందన్నారు. అంతకుముందే పెంచితే బీజేపీకి ఓట్లు వేయరని తెలుసుకొని ఎన్నికలు అయిపోయిన తర్వాత పెంచడం దారుణమన్నారు. నేడు పెట్రోల్, డీజిల్ పెంచడం వలన పేద ప్రజలకు నిత్యవసర సరుకుల రేట్లు పెరిగి పూట గడవడం కష్టంగా మారిందన్నారు. అదేకాకుండా మిగతావాటిపై కూడా చాలా ప్రభావం పడుతుందని, కాబట్టి వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ఆవుల యాదయ్య, మంచాల గ్రామ శాఖ కార్యదర్శి గడ్డం బాలరాజ్, పార్టీ మంచాల మండల మాజీ కమిటీ సభ్యులు సయ్యద్ హఫీజ్, సింకోచ్ శ్రీకాంత్ చారి, డివైఎఫ్ఐ మండల నాయకులు ఒగ్గు ప్రభాకర్, ఏర్పుల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.



## నూతన డిజిపి సివి ఆనంద్ కు శుభాకాంక్షలు తెలిపిన టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి

( హైదరాబాద్ ) తెలంగాణ రాష్ట్ర నూతన డిజిపిగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను శనివారంనాడు హైదరాబాద్ లోని డిజిపి కార్యాలయంలో టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిజిపి సివి ఆనంద్ కు పుష్పగుచ్ఛంను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మాట్లాడుతూ నూతన బాధ్యతల్లో డిజిపి విజయవంతం కావాలని, అయన నేతృత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మరింత పటిష్టం కావాలని శేర్ నర్సారెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణను జీరో క్రైం రేట్ స్టేట్ గా మార్చే లక్ష్యంతో నూతన డిజిపి సివి ఆనంద్ కృషి చేస్తారనే ఆశాభావాన్ని టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి వ్యక్తం చేశారు.

# టాప్ టెన్ విద్యార్థులకు మెమొంటోలు అందజేసిన కలెక్టర్:

**పురస్కారాలు అందుకున్న విద్యార్థులకు ఎల్లప్పుడూ నేను అందుబాటులో ఉంటాను, నేను ఏ జిల్లాలో ఉన్న మీకు కావలసిన వసతులు కల్పిస్తాను , జిల్లా కలెక్టర్ మన చౌదరి,**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 16,,(విజన్ ఆంధ్ర ప్రతినిధి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా నేడు కలెక్టరేట్ ఆవరణలో విద్యా విజయోత్సవం కార్యక్రమంలో పదవ తరగతి టాప్ టెన్, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో టాప్ టెన్, క్రీడా విభాగంలో టాప్ 3 విద్యార్థులను, ఉల్లాస్ వాలంటీర్స్గా పనిచేసినటువంటి ముగ్గురిని కలెక్టర్ సత్కరించారు. మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పదివేల రూపాయల పారి తోషికముతో పాటు ఒక మెమెంటో అప్రిషియేషన్ సర్టిఫికెట్స్ను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో, జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, భవిష్యత్తులో విద్యార్థులు మంచి స్థాయికి చేరుకోవడానికి తగిన మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా తన స్కూల్ నాటి అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. నేను ఏ జిల్లాలో పనిచేసినప్పటికీ నేడు ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్నటువంటి విద్యార్థులు వారి ఉన్నత చదువుల కోసం మంచిగా చదువుకోవడానికి కావలసినటువంటి వసతులు కల్పించడానికి నేను ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని మాట ఇచ్చి విద్యార్థులలో ఒక నూతన ఉత్తేజాన్ని నింపారు. జిల్లా విద్యాశాఖ అధికారి, ఐ, విజయ కుమారి మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మంచి ప్రతిభావంతులైనటువంటి విద్యార్థులు చదువుకోవడం నాకు గర్వకారణంగా ఉంది అంటూ చెబుతూ జిల్లా ఫలితాలలో భాగస్వామ్యం వహించినటువంటి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. మున్ముందు మంచి ఫలితాలను సాధించి మంచి ఉజ్వల భవిష్యత్తు లో స్థిరపడాలని విద్యార్థులను కోరారు. ర్యాంకులు సాధించినటువంటి విద్యార్థులతో, తల్లిదండ్రులతో ఉపాధ్యాయులతో వారి జ్ఞాపకార్థం ఫోటో సెషన్స్ లో కలెక్టర్ పాల్గొన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతుల నిరసన

జన్నారం, మే 16 (విజన్ ఆంధ్ర) : మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మాక్కలను కొను గోలు చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు నిరసన చేపట్టారు.జన్నారం మండలంలో ని రోటీగూడ గ్రామంలో ప్రభుత్వం వెంటనే మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పటు చేసి మాక్కలను లను కొనుగోలు చేయాలని శనివారం రోజున గ్రామ నికి చెందిన రైతులు మండలకేంద్రంలోని తహసీల్దా ర్ కార్యాలయం ముందర నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సుమా రు వంద ఎకరాలలో మొక్కజొన్న సాగుచేసినప్ప టికి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలేదని ఆ వేదన వ్యక్తం చేశారు. కేవలం జన్నారంలోని వ్యవ సాయ మార్కెట్ లో మాత్రమే కొనుగోలు కేంద్రం ఏ ర్పాటు చేశారని ఇంత దూరం తీసుకరావలంటే ట్రా న్స్ పోర్ట్ చార్జీలు పెరిగి రైతులపై అధికభారం పడు తుందని అన్నారు. అకాల వర్షాల ములంగా ఎక్క డ పంట తడిసి నష్టం వాటిల్లుతుందోనని కంటి మీ ద కునుకు లేకుండా ఉ న్నమని అన్నారు. వెంటనే అధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేం ద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని తహసీ ల్దార్ బక్కయ్యకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



# నాగులపల్లిలో త్రాగునీటి సమస్యకు పరిష్కారం

**- సొంత నిధులతో బోర్ మంజూరు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



షాద్ నగర్, విజన్ ఆంధ్రా మే16: ఫరూక్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సొంత నిధులతో బోర్ బావి మంజూరు చేశారు. గ్రామ సర్పంచ్, ప్రజల విజ్ఞప్తికి స్పందించిన ఆయన బోర్ తవ్వకాలకు సహకరించారు.

శనివారం గ్రామ సర్పంచ్, నాయకులు, గ్రామ ప్రజల చేతుల మీదుగా బోర్ బావి పనులను ప్రారంభించారు. బోర్‌లో సమృద్ధిగా నీరు రావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. త్రాగునీటి కొరతను తీర్చేందుకు తీసుకున్న ఈ చర్య ఎంతో ఉపయోగకరమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందించి బోర్ మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్, ఉపసర్పంచ్ కిరణ్ గౌడ్, నాయకులు జయరాం గౌడ్, వార్డు సభ్యులు మొగుటం కుమార్, రజిత, లక్ష్మీ నరసింహ, స్వామి, బౌరయ్య, గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, నరసింహ, నారాయణ, సందీప్, రఘురాం రెడ్డి, కుమార్ గౌడ్, మహేష్, శ్రీధర్, జంగయ్య, చంద్రశేఖర్, శ్రీకాంత్, మల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వారోత్సవాల ఆరవ రోజున విద్యార్థులకు వ్యాసరచన పోటీలు..!

మహాదేవపూర్ మే 16 (విజన్ ఆంధ్ర) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు విద్యా వారోత్సవాల ఆరవ రోజు జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) కోఆర్డినేటర్ డాక్టర్ ఈ మాధవి ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు మరియు క్విజ్ కాంపిటీషన్ ఏర్పాటు చేయడం జరిగినది ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ బహుమతులు ప్రధానం చేసి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే కష్టపడి ఇష్టంతో చదువు మీద శ్రద్ధ పెట్టినట్లయితే విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పేర్కొనడం జరిగినది ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం మరియు నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొనడం జరిగినది.



# ఎమ్మెల్యే స్పందిస్తే సమస్యే ఉండదు, మళ్లీ ఈ ముప్పు తప్పదా..?

జడ్చర్ల, మే 16, (విజన్ ఆంధ్ర): మళ్లీ ఈ ముప్పు ఎదుర్కోక తప్పేలా లేదు..? జడ్చర్ల, నవాబుపేట మండలాల గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడం, రోడ్డు పునర్నిర్మించకపోవడంతో ప్రతి వర్షాకాలం ఇదే దుస్థితి పునరావృతం అవుతోంది. గత సంవత్సరం వర్షాకాలంలోనూ ఈ గ్రామ శివారులో విద్యార్థులు మోకాల్లోతు వరద నీటిలో బడికి వెళ్లిన దృశ్యాలు, స్కూల్ బస్సులు నిలిచిపోయిన ఘటనలు, వాహనాలు వరదలో చిక్కుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. గొర్రెల మందతో సహా గ్రామస్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటిన ఫోటోలు అప్పటి దుస్థితికి అద్దం పడుతున్నాయి.

ఏడాది గడిచినా సమస్యకు పరిష్కారం లభించలేదు. కల్వర్టు నిర్మించరు..? రోడ్డును ఎత్తు చేసి పునర్నిర్మించరు..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకుంటే ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తవని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

వర్షాకాలంలో ద్వీపకల్పంలా మారే 15 గ్రామాలకు: ప్రాణ నష్టం భయం

గత చాలా సంవత్సరాలుగా ప్రతి వర్షాకాలంలో ఉదండాపూర్ రిజర్వాయర్ పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు అధికంగా కురిస్తే ఈ ప్రాంతం మొత్తం



ఓ ద్వీపకల్పంలా మారుతోంది. గత ఏడాది కిష్టారం-అంబటిపల్లి మధ్య చెరువు అలుగు నీటి ఉధృతిలో భార్యాభర్తలు కొట్టుకుపోయిన ఘటన ఇంకా ప్రజల మదిలో మెదులుతోంది. యుద్ధ ప్రాతిపదికన రోడ్ల పునర్నిర్మాణాలు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రజలు మనవి చేస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన పరిష్కరించాల్సిన 15 ప్రమాదకర గ్రామాలు:

1. పోలేపల్లి-కిష్టారం మధ్యగల కల్వర్టు దగ్గర
2. కిష్టారం-దొడ్డిపల్లి మధ్య గల చిన్న చెరువు వెనుక కల్వర్టు దగ్గర
3. దొడ్డిపల్లి గ్రామ సమీపంలో
4. రుద్రారం గ్రామంలో, రుద్రారం-కూచూర్ మధ్య గల రాజమోని వంపు దగ్గర
5. కూచూర్ దగ్గర గల ఆకులోని కుంట దగ్గర
6. మల్లారెడ్డిపల్లి-చెన్నారెడ్డిపల్లి మధ్య
7. చెన్నారెడ్డిపల్లి గ్రామం దగ్గర లెంకల చెరువు అలుగు
8. చెన్నారెడ్డిపల్లి-రుక్కంపల్లి గ్రామాల మధ్య కల్వర్టులు
9. కారూరు-ఇప్పటూరు మార్గంలో కల్వర్టు దగ్గర
10. కారూరు గ్రామం ఆంజనేయస్వామి దేవాలయం ముందు రోడ్డుపై చెరువు అలుగునీరు
11. కిష్టారం-ఖానాపూర్ మధ్య ఉదండాపూర్ రిజర్వాయర్ వెనుక భాగంలో
12. పెద్దపల్లి-వల్లూరు గ్రామాల మధ్య
13. ఉదండాపూర్-వల్లూరు గ్రామాల మధ్య
14. ఉదండాపూర్-కిష్టారం గ్రామాల మధ్య
15. కిష్టారం-అంబటిపల్లి మధ్య చెరువు అలుగు నీటి ఉధృతిలో గత సంవత్సరం భార్యాభర్తలు కొట్టుకుపోయిన ప్రమాదకర ప్రాంతం

ప్రజల విజ్ఞప్తి వర్షాకాలం సమీపిస్తున్నందున ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి పైన పేర్కొన్న 15 ప్రాంతాల్లో శాశ్వత కల్వర్టుల నిర్మాణలు, రోడ్డు పునర్నిర్మాణలు చేపడితే ప్రతి వర్షాకాలంలో ఎదురయ్యే ఈ ముప్పు శాశ్వతంగా తొలగిపోతుందని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. లేకుంటే మళ్లీ ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## డిగ్రీ కళాశాలలోవిద్యావారోత్సవాలు

### - కృత్రిమ మేధస్సుపై అవగాహన కార్యక్రమం

భైంసా, మే 16: విజన్ ఆంధ్ర. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భైంసాలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆరో రోజు విద్యార్థుల కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధునిక సాంకేతికతలో కృత్రిమ మేధస్సు ప్రాధాన్యత, విద్యా రంగంలో దాని వినియోగం, భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొని సాంకేతిక పరిజ్ఞానంపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అదేవిధంగా కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోటీలు విద్యార్థులలో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, వాక్చాతుర్యాన్ని పెంపొందించేందుకు దోహదపడ్డాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. బుచ్చయ్య మాట్లాడుతూ, విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. రఘునాథ్, ఐక్యూఏసీ సమన్వయకర్త డా. రవి కుమార్, డోస్ట్ సమన్వయకర్త డా. భీమారావు, సీనియర్ అధ్యాపకులు డా. ఎం. శంకర్, డా. ఓంప్రకాశ్, డా. సంతోష్ కుమార్, డా. నాహేదా, డా. కల్పనతో పాటు అధ్యాపకులు దివ్య, రాజు, శ్రావణ్య, సురేందర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## నవాబుపేటలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

### - లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం

జడ్చర్ల /నవాబ్ పేట / మే 16,(విజన్ ఆంధ్ర): జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశాల మేరకు నవాబుపేట మండలంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల తహసీల్దార్, గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సంయుక్తంగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆదేశాలతో లబ్ధిదారులకు సకాలంలో చెక్కులు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సాయం అందడంతో లబ్ధిదారుల



కుటుంబాలు హర్షం వ్యక్తం చేశాయి. పేదరికంలో ఆడపిల్ల పెళ్లి చేయడం భారంగా మారిన తరుణంలో ప్రభుత్వం అందిస్తున్న రూ. 1,00,116 చొప్పున ఆర్థిక సాయం ఎంతో ఉపయోగపడుతుందని లబ్ధిదారులు తెలిపారు. సకాలంలో చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి, మండల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## బావిలో ఈత కొడుతూ మృత్యు ఒడిలోకి

**- ఆలస్యంగా గమనించిన సహచరులు 30 మంది మధ్య విషాదం**

**- మృతదేహాన్ని వెలికి తీసిన ఫైర్ సిబ్బంది**

**- ఊర్కొండ మండలం ఊర్కొండపేటలో ఘటన కుటుంబసభ్యుల కన్నీరుమున్నీరు**

జడ్చర్ల,/ ఊర్కొండ,/ మే 16 (విజన్ ఆంధ్ర): బావిలో సరదాగా సహచరులతో కలిసి ఈత కొడుతూ నీటిలో మునిగి యువకుడు మృతి చెందిన సంఘటన ఊర్కొండ మండలం ఊర్కొండపేట శివారులో చోటుచేసుకుంది. ఆ సమయంలో బావిలో సుమారు 30 మంది యువకులు ఈత కొడుతుండటంతో తమ సహచరుడు నీటిలో మునిగిపోయిన విషయాన్ని ఎవరూ గమనించకపోవడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఊర్కొండ మండల పరిధిలోని ఊర్కొండపేట శివారులో శనివారం ఈ విషాదం చోటుచేసుకుంది. అదే గ్రామ పంచాయతీ కార్మికురాలి చెల్లెలి కుమారుడు కాలే అనిల్ (20) పెద్దమ్మ వద్ద ఉంటూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నాడు. శనివారం గ్రామ శివారులోని బావిలో తన సోదరులు, మిత్రులతో కలిసి సుమారు గంటపాటు ఈత కొడుతూ సరదాగా గడిపారు.

ఆ సమయంలో బావిలో 30 మందికి పైగా ఈత కొడుతుండటంతో ఎవరు ఈత కొడుతున్నారో, ఎవరు ఒడ్డున ఉన్నారో గమనించే స్థితిలో లేరు. ఈ క్రమంలో అందరూ బావి ఒడ్డుకు చేరి ఇంటికి వెళ్దామనుకునే సమయంలో అనిల్ కనిపించకపోవడంతో సోదరులు, యువకులు ఆందోళన చెందారు. మరోసారి బావి మొత్తం గాలించినా ఎక్కడా అనిల్ జాడ కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కల్వకుర్తి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. కల్వకుర్తి ఫైర్ స్టేషన్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది బావిలో మునిగిపోయి ఉన్న అనిల్ మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబ సభ్యులు బావి వద్దకు చేరుకుని అనిల్ మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం మృతి చెందిన బాలుడు కాలే అనిల్ (20) తలకొండపల్లి మండలం చౌదరపల్లి గ్రామానికి చెందినవాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. వేసవిలో బావులు, చెరువుల్లో ఈతకు వెళ్లే యువకులు అప్రమత్తంగా ఉండాలని, గుంపుగా వెళ్లినప్పుడు ఒకరినొకరు గమనిస్తూ ఉండాలని స్థానికులు సూచిస్తున్నారు.

## కొండగట్టు అంజన్న ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన రమాదేవి

మల్యాల, మార్చి 04 (విజన్ ఆంధ్ర): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయ పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ ఈవో) రమాదేవి బుధవారం అధికారికంగా స్వీకరించారు. గత మూడు రోజుల క్రితమే ప్రభుత్వం ఆమెను వేములవాడ నుంచి కొండగట్టు ఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా, నేడు ఆమె ఆలయానికి చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం పలు కీలక సూచనలు చేశారు: ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు, వీఐపీ భక్తులకు మధ్య ఎలాంటి వ్యత్యాసం చూపకుండా అందరికీ సమాన గౌరవం ఇచ్చి స్వామివారి దర్శనం కల్పించాలని అర్చకులను, అధికారులను ఆదేశించారు.

విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిజిటల్ సేవలు: భక్తుల సౌకర్యం కోసం త్వరలోనే ఆలయ ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని, భక్తులు సమర్పించే బంగారం, వెండి కానుకలకు తప్పనిసరిగా రసీదులు అందజేయాలని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఈవో ఆలయ పరిసరాలను పరిశీలించి, భక్తులతో నేరుగా మాట్లాడి అక్కడ ఉన్న సమస్యలను, వసతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో హరిహరనాథ్, ఆలయ అధికారులు, అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

### బ్రతుకు దేరువు కోసం వెళ్లి మార్గం మధ్యలో

## ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి....

బోనకల్ మే 16 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో ట్రాక్టర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వాడు లాస్ట్ లో స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తల్లాడ మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన మిరపకాయల వ్యాపారం చేసే లింగం నరసింహారావు (30)అనే వ్యక్తి తన రోజువారి పనులు ముగించుకొని వత్సవాయి వైపు నుండి తన స్వగ్రామం జగన్నాధపురం వెంకటగిరి కి తిరిగి వెళుతున్న క్రమంలో తెలంగాణ ఆంధ్ర సరిహద్దు లో చెక్ పోస్ట్ దగ్గరలో స్నేహ మొక్కజొన్న మిల్లు వద్ద బోనకల్ గ్రామానికి చెందిన బండి నాగేశ్వరరావు కు చెందిన స్వరాజ్ ట్రాక్టర్ ఆటోను తప్పించబోయి ఎదురుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న నరసింహారావు ను బలంగా ఢీకొనడంతో నరసింహారావు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న బోనకల్ ఎస్ఐ పొదిలి వెంకన్న, పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

## సిమెంటు రోడ్డు పనులను అడ్డుకున్న రితీష్ రెడ్డి

**- అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించేది లేదంటూ పోరకలు చేటలు చూపిస్తున్న మహిళలు**



బద్వేలు, మే 16 (విజన్ ఆంధ్ర) బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డు తెలుగు గంగ కాలనీలో ప్రభుత్వం నిర్వహించిన టెండర్ లో దక్కించుకున్న కాంట్రాక్టర్ సిమెంటు రోడ్డు పనులు చేపడుతున్న సందర్భంలో బద్వేలు టిడిపి సమన్వయకర్త రితీష్ రెడ్డి వర్గం అనుచరులు సిసి రోడ్డు. పని చేపట్టే దగ్గరికి వెళ్లి అడ్డు కోవడం జరిగింది ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అక్కడనుండి పంపి పనులు సజావుగా సాగేటట్లు చూశారు ఈ విషయం 22 వార్డు లోని మహిళలకు తెలియడంతో వారు ఆగ్రహంతో ఊగిపోతూ పోరకలు చేటలు చేత పట్టుకొని ఇక్కడ మా కాలనీలో జరిగే అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించేది లేదంటూ వారిని హెచ్చరించారు ఇదేవిధంగా గడచిన నెల క్రితం కూడా డిసిసి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి అనుచరులు పనులు చేస్తున్నారని కాంట్రాక్టర్ ను పనులు ఆపుటకు ప్రయత్నించగా వారు పోలీసులను ఆశ్రయించి పనులు పూర్తిచేయడం జరిగింది నియోజకవర్గంలో టిడిపి పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయి అయోమయంలో టిడిపి క్యాడర్ ఉండడంతో ఈ విషయం రాష్ట్ర పార్టీ అధిష్టానం, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి. తీసుకుపోవడం కూడా జరిగిందనీ తెలిసింది

## జడ్చర్ల మార్కెట్‌లో తడిసిన రైతన్నల కల

**- అకాల వర్షానికి తడిసిముద్దైన వడ్ల రాశులు**

**-కళ్ల ముందే పంట కొట్టుకుపోతుంటే నిస్సహాయంగా రైతన్నలు**

**- తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్**



జడ్చర్ల, మే 16 (విజన్ ఆంధ్ర ) : ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షపు పాలైతే ఆ రైతన్న బాధ వర్ణనాతీతం. జడ్చర్ల వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం ఇదే దృశ్యం కనిపించింది. మధ్యాహ్నం ఒక్కసారిగా కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో కుప్పలుగా పోసిన వడ్లు, బస్తాలు తడిసిముద్దయ్యాయి. మార్కెట్‌లోని దృశ్యాలు రైతుల గుండెలు పిండేశాయి. కొన్ని ధాన్యం బస్తాలపై నల్లటి ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉన్నప్పటికీ, ముందు భాగంలో ఆరబోసిన వడ్లు మాత్రం వర్షపు నీటిలో తేలియాడుతున్నాయి. యార్డులో నీరు నిలిచి ధాన్యం కొట్టుకుపోతుండటంతో రైతులు లబోదిబోమన్నారు.

అప్పు చేసి పంట పండిస్తే, అమ్ముకుందామని మార్కెట్‌కు తెస్తే ఇలా వానపాలైంది. మా కళ్ల ముందే పంట నీటిలో కొట్టుకుపోతుంటే ఏడుస్తూ చూస్తుండటం తప్ప ఏమీ చేయలేకపోతున్నాం అని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు.

మార్కెట్‌లో సరైన షెడ్లు లేకపోవడం, సరిపడా వాటర్ ప్రూఫ్ నల్ల కవర్లు ఇవ్వకపోవడంతో ప్రతి ఏటా ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రోజుల తరబడి మార్కెట్‌లోనే పడిగాపులు కాయాల్సి వస్తోందని, ఈ లోపు వర్షం వస్తే నష్టపోవాల్సిందేనని వారు వాపోయారు. మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

వానకు తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వెంటనే మార్కెట్‌లో తాత్కాలిక షెడ్లు, వాటర్ ప్రూఫ్ కవర్లను ఏర్పాటు చేసి రైతుల పంటను కాపాడాలని కోరారు.

# జడ్చర్లలో యువతి దారుణ హత్య,

**జడ్చర్లలో యువతి దారుణ హత్య, కత్తితో గొంతు కోసిన యువకుడు**

**లి ఎర్ర సత్యం కాలనీలో అందరూ చూస్తుండగానే ఘాతుకం**

**లి ఆసుపత్రికి తరలించేలోపే వైష్ణవి మృతి**

**లి నిందితుడిని చితకబాదిన స్థానికులు: పరిస్థితి విషమం**

**లి రెండేళ్లుగా ప్రేమ, డబ్బులు ఖాళీ చేసింది అంటూ నిందితుడి వాంగ్మూలం**

జడ్చర్ల, మే 16,(విజన్ ఆంధ్ర) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణం ఎర్ర సత్యం కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కాలనీకి చెందిన బండారు వైష్ణవి (24)నీ కాలనీలో అందరూ చూస్తుండగానే ఓ యువకుడు కత్తితో వైష్ణవి గొంతు కోయడంతో వైష్ణవి అక్కడికక్కడే రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. దీంతో యువతికి చలనం లేకపోవడంతో హుటాహుటిన జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పటికే వైష్ణవి మృతి చెందింది. కాగా దాడికి పాల్పడ్డ గుర్తుతెలియని యువకుడిని కాలనీవాసులు చితకబాదాడంతో యువకుడి పరిస్థితి విషమంగా మారింది. అయితే యువకుడి కాళ్లు చేతులను తాళ్లతో కట్టి వివరాలు అడగడంతో వైష్ణవి తనను రెండేళ్లుగా ప్రేమిస్తుందని, తనతో ఉన్న డబ్బులని ఖాళీ చేసిందని, అందుకే దాడికి పాల్పడ్డానని సమాధానం ఇచ్చాడు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దాడికి పాల్పడ్డ యువకుడినీ హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరోవైపు వైష్ణవి మృతి చెందడంతో జడ్చర్ల ప్రభుత్వాసుపత్రిలో ఆందోళనకర వాతావరణం నెలకొంది. పట్ట పగలే జరిగిన ఈ దారుణ హత్యతో కాలనీలో భయానక వాతావరణం నెలకొంది.







# మత్తు పదార్థాల వినియోగం మళ్లీ పునరావృతమైతే పి.డి యాక్టు తప్పదు

## అవగాహన సదస్సులో సీపీ సాయి చైతన్య హెచ్చరిక

నిజామాబాద్ మే16:( విజన్ ఆంధ్ర ) డ్రగ్స్, మత్తు పదార్థాల వినియోగం మళ్లీ పునరావృత్తమైతే పిడి యాక్ట్ తప్పదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య హెచ్చరించారు.
తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో , నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం జిల్లా పోలీస్ శాఖ, ఈగల్ టీం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమము పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.
ఈ కార్యక్రమంలో గతంలో గంజాయి , డ్రగ్స్ వినియోగం, అక్రమ రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు , రౌడీ షీటర్లు , అనుమానితులను పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు పిలిపించి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వలన యువత భవిష్యత్తు నాశనం అవుతుందని , కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు.
గంజాయి, డ్రగ్స్ వినియోగం ఆరోగ్యపరంగా ప్రమాదకరమేకాకుండా చట్టపరంగా కూడా తీవ్రమైన నేరమని , ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో కేసులు నమోదైన వ్యక్తులు తమ ప్రవర్తన మార్చుకొని సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని, మళ్లీ ఇలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటే పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.
జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగుతుందని, విద్యాసంస్థలు, హాస్టళ్లు, పబ్లిక్ ప్రదేశాల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.
యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య , ఉపాధి మరియు కుటుంబ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు.
ప్రజలు కూడా సామాజిక బాధ్యతగా తమ పరిసరాల్లో ఎక్కడైనా గంజాయి, డ్రగ్స్ విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు.
అనంతరం ఈగల్ టీం పోలీస్ సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అనుమానితులకు డ్రగ్స్ పరీక్షలు చేపట్టారు. ఈ పరీక్షల్లో కొంతమంది వ్యక్తులకు డ్రగ్స్ వినియోగం పాజిటివ్‌గా తేలడంతో వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించడం జరిగిందన్నారు.
ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఏ.ఆర్) రామ్ చందర్రావు , నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ , ఈ గల్ టీం డీఎస్పీ ఎం. సోమనాథం , హోమ్ గార్డ్ ఏసిపి కె. దీపక్ చంద్ర , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీధర్ రెడ్డి , నిజామాబాద్ టౌన్ సిఐ శ్రీనివాస రాజ్ , సౌత్ రూరల్ సిఐ ఎన్. సురేష్ కుమార్ , నార్త్ రూరల్ సీఐ బి. శ్రీనివాస్ , డిచ్పల్లి సిఐ కె. వినోద్ , ధర్పల్లి సిఐ బిక్షపతి , నిజామాబాద్ డివిజన్ ఎస్.హెచ్.ఓ లు , ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు

## తక్షణమే ధరల పెంపును ఉపసంహరించాలి

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి




కడప, మే 16 (విజన్ ఆంధ్ర) కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతంగా పెంచి ప్రజలపై భారం మోపిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి కడప డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జ్యోతి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గడచిన నాలుగు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3కు పెంచడం ప్రజలపై మరింత ఆర్థిక భారం మోపినట్లేనని ఆమె తీవ్రంగా విమర్శించారు. ఈ ధరల పెంపుతో రాష్ట్రంలో పెట్రోల్ ధర లీటరుకు రూ.109.75 నుండి రూ.113.03కు, డీజిల్ ధర రూ.97.57 నుండి రూ.100.71కు పెరిగిందని ఆమె తెలిపారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ఇంధన ధరల పెంపు ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచి ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు.
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వ వైఫల్యాల ఫలితమే ప్రజలు ఈ భారాన్ని మోయాల్సి వస్తోందని విజయ జ్యోతి ఆరోపించారు. 2024 పార్లమెంటు ఎన్నికలకు ముందు రూ.2 తగ్గింపు పేరుతో ప్రజలకు ఇచ్చిన ఉపశమనం ఇంకా పూర్తిగా అనుభూతి కాకముందే మళ్లీ భారీగా పెంచడం ప్రజలను మోసం చేసినట్లేనని ఆమె అన్నారు. భవిష్యత్తులో మరిన్ని వసూళ్లకు కూడా ప్రభుత్వం సిద్ధమవుతోందనే ఆమె తెలిపారు ఇంధన ధరల పెంపు రాష్ట్ర, కేంద్ర ,ప్రభుత్వ నాయకత్వ సంక్షోభానికి, పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పెట్రోల్, డీజిల్ ధరల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీఖ్ ఖాన్, శీలం గంగయ్య ,షామీర్ హుస్సేన్ పాల్గొన్నారు

# ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్యుడికి దక్కని గౌరవం

## - అధికారుల తీరుపై మండిపడ్డ డా. పెద్దగొల్ల నారాయణ



జహీరాబాద్ మే 16 (విజన్ఆంధ్ర) : ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజలకు తగిన గౌరవం దక్కడం లేదని ఝరాసంగం మండల్ నాయకుడు, ప్రముఖ కవి, రచయిత డా. పెద్దగొల్ల నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ... "పదవి అనేది అధికారం చెలాయించడానికి కాదు.. బాధ్యతను నెరవేర్చడానికి లభించిన ఒక అవకాశం" అని పేర్కొన్నారు. గత కొంతకాలంగా వివిధ ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన సందర్భంగా అక్కడి పరిస్థితులు తనను కలచివేశాయని తెలిపారు. కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలతో కొంతమంది అధికారులు దురుసుగా, అగౌరవంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే జీతం సామాన్య ప్రజలు కట్టే పన్నుల ద్వారానే వస్తుందని గుర్తు చేశారు. ప్రజలే ప్రభుత్వానికి యజమానులని, అధికారులు సేవకులని అన్నారు. కార్యాలయాలకు వచ్చే పేదలను చిన్నచూపు చూడడం సరికాదన్నారు. వస్త్రధారణ ఆధారంగా మనుషులను అంచనా వేయకూడదని సూచించారు. సూట్, బూట్ వేసుకుని వచ్చిన వారికి ఒకలా, సాధారణ దుస్తుల్లో వచ్చిన పేదలకు మరోలా ప్రవర్తించడం బాధాకరమన్నారు. ప్రతి వ్యక్తిని మానవత్వంతో గౌరవించాలని కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వృద్ధులు, మహిళలు, వికలాంగులు గంటల తరబడి నిలబడే పరిస్థితులు కనిపిస్తున్నాయని, "కూర్చోండి.. మీ సమస్య చెప్పండి" అనే ఒక్క మాటే వారికి ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. ప్రజల సమస్యలను ఓపికగా విని, నిబంధనల ప్రకారం వివరించడం కూడా ఒక సేవేనని పేర్కొన్నారు. చిరాకు, విసుక్కోవడం సమస్యలకు పరిష్కారం కాదని, అది ప్రజల మనసులను గాయపరుస్తుందని అన్నారు. కొన్ని కార్యాలయాల్లో మార్పు కనిపిస్తున్నప్పటికీ, అన్ని చోట్లా ప్రజలకు గౌరవం దక్కే విధంగా అధికారులు తమ తీరు మార్చుకోవాలని సూచించారు. పదవులు శాశ్వతం కావని, కానీ ప్రజలకు ఇచ్చే గౌరవం మాత్రం చిరస్థాయిగా నిలుస్తుందని డా. పెద్దగొల్ల నారాయణ పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపుపై కలెక్టర్ సమీక్ష

నిజామాబాద్, మే 16 :( విజన్ ఆంధ్ర) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండు పడక గదుల కేటాయింపుపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష జరిపారు. ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మొదటి విడతలో ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకురాని వారి మంజూరీలను రద్దు చేసిన చోట, వారి స్థానంలో అర్హులైన కొత్త వారిని వెంటనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ వారం రోజుల్లోపు పూర్తి చేయాలని గడువు విధించారు. ఇందిరమ్మ కమిటీలను సంప్రదించి ఆసక్తి కలిగిన అర్హులను గుర్తించాలన్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఫోటో, పూర్తి వివరాలతో జియో ట్యాగింగ్ సహా సత్వరమే సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు.
రెండు పడక గదుల ఇళ్లను అర్హులైన వారికి కేటాయించేందుకు



లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులను ఖరారు చేయాలని, వీడియోగ్రఫీ మధ్యన జిల్లా అధికారుల సమక్షంలో పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. అన్ని చోట్ల ఈ నెలాఖరు లోపు డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, హౌసింగ్ పీ.డీ గంగాధర్, ఎ.ఈ నివర్తి తదితరులు పాల్గొన్నారు.

## కోత తరువాత పొలంలో ఉంచిన జొన్న కంకులు అగ్నికి ఆహుతి... రైతుకు తీవ్ర నష్టం

- అన్నీ కాలిపోయాయి సార్"... రైతు విలపన

మర్పల్లి, మే 16 (విజన్ ఆంధ్ర): మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన రైతు విజయలక్ష్మి తన పొలంలో పండించిన జొన్న పంటను కోసి కంకులుగా సిద్ధం చేసి పొలంలో ఉంచిన సమయంలో అనూహ్యంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కంకులుగా సిద్ధం చేసిన జొన్న పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో రైతు భారీ నష్టాన్ని చవిచూశారు. పంటను కోసి అమ్మకానికి సిద్ధం చేసిన కీలక సమయంలో ఈ ప్రమాదం జరగడం రైతుకు మరింత ఆర్థికంగా దెబ్బతీసింది. అద్దెకరగా సాగు చేసిన ఈ పంట కాలిపోవడంతో రైతు విజయలక్ష్మి తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందన్నది స్పష్టంగా తెలియకపోయినా, ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో రైతు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. సుమారు రూ. 30 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. ఈసారి పెట్టుబడులు ఎక్కువయ్యాయి... ఇప్పుడు పంట కాలిపోవడంతో తీవ్ర అప్పుల్లో కూరుకుపోయాను అని విజయలక్ష్మి కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత రైతుకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు, స్థానిక నాయకులు కోరుతున్నారు.

## నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి: రవికుమార్

చేవెళ్ల, మే 16 (విజన్ ఆంధ్ర): నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ సోషల్ మీడియా ఇంచార్జ్ రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన చేవెళ్లలో 'విజన్ ఆంధ్ర'తో మాట్లాడుతూ... అధికారంలోకి రాకముందు ప్రతి సంవత్సరం రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రూ. 3 లక్షల వరకు సబ్సిడీతో ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయకపోవడం, బడ్జెట్‌లో యువతకు ఆర్థిక సహాయం అంశాన్ని ప్రస్తావించకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేలా వెంటనే ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని పారదర్శకంగా అమలు చేసి అర్హులైన యువతకు సబ్సిడీతో సహాయం అందించాలన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆటలాడకుండా తెలంగాణ యువత ఆశలను నెరవేర్చేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ఉద్యమకారుల గుర్తింపునకై కమిటీ ఏర్పాటు పట్ల హర్షం

మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు జావేద్ ఖాన్

కాటారం, మే 16 (విజన్ ఆంధ్ర) : ఉద్యమకారుల గుర్తింపునకై కమిటీ ఏర్పాటు పట్ల మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు జావేద్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సేవలు, త్యాగాలను అధికారికంగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడం పట్ల జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు జావేద్ ఖాన్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని సాధారణ పరిపాలన శాఖ జీఓ ఆర్టీ నం.679 ద్వారా ప్రకటించిందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారు, శారీరక వైకల్యానికి గురైనవారు, కేసులు ఎదుర్కొని జైలు జీవితం గడిపిన వారి సేవలను గౌరవించాలనే ఉద్దేశంతో ఈ కమిటీని ఏర్పాటు చేయడం సమయోచితమని అన్నారు. కమిటీ ప్రధాన బాధ్యతలలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు స్పష్టమైన ప్రమాణాలు రూపొందించడం, ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితా సిద్ధం చేయడం, వారికి ఇవ్వాల్సిన గుర్తింపు, గౌరవం, సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం, అవసరమైతే కమిటీ అధికారులు ఇతర వ్యక్తులను పిలిపించి సమాచారం సేకరించవచ్చని పేర్కొన్నారు. సమావేశాలు నిర్వహించి నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్న విధంగా కార్యాచరణ మొదలు పెట్టాలని తెలంగాణ ఉద్యమకారుల తరపున మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ మెంబర్ జావేద్ ఖాన్ కోరారు.

## ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తిప్పని మాధవిరామ్‌రెడ్డి



చేవెళ్ల, మే 16 (విజన్ ఆంధ్ర): ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రేగడి ఘనాపూర్ సర్పంచ్, రంగారెడ్డి జిల్లా మహిళా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు తిప్పని మాధవి రామ్‌రెడ్డి ఆకాంక్షించారు. చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య జన్మదిన సందర్భంగా శనివారం చించల్‌పేట్ గ్రామంలోని ఆయన నివాసంలో తిప్పని మాధవి రామ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యే మరింత కాలం ప్రజాసేవ కొనసాగించాలని కోరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ... తనపై చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సంక్షేమమే తన ప్రధాన లక్ష్యమని, చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేగడి ఘనాపూర్ ఉప సర్పంచ్ ఈదులపల్లి మహేశ్వరిరాములు, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గంజాయి సరఫరా, వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యంగా నార్కోటిక్ జాగిలాలతో విస్తృత తనిఖీలు.

భూపాలపల్లి జిల్లా మే 16 ( విజన్ ఆంధ్ర ) ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆపరేషన్ ఆర్ ఐ కాశీరాం ఆధ్వర్యంలో ఈగల్ టీం సిబ్బంది నార్కోటిక్ డాగ్ సహాయంతో భూపాలపల్లి జిల్లాలోని పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు, బస్టాండ్ ప్రాంతాల్లో నార్కోటిక్ జాగిలాలతో తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అలాగే యువత మత్తు పదార్థాల బారిన పడకుండా జిల్లాలో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి మరియు ఇతర నిషేధిత మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఎవరైనా వ్యక్తులు, పాన్ షాప్‌లు, కిరాణా దుకాణాలు లేదా ఇతర వ్యాపార సంస్థల్లో ప్రభుత్వం నిషేధించిన గంజాయి, మత్తు పదార్థాలను నిల్వ ఉంచినా లేదా విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన, ప్రజల భద్రత మరింత సమర్థవంతంగా కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు చేపట్టాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, మే 16 :( విజన్ ఆంధ్ర) బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బీఎల్ఏ ల నియామకం జాబితాను నిర్ణీత ఫార్మాట్ ప్రకారం అందించాల్సిందిగా రాజకీయ పార్టీలను మరోమారు లిఖితపూర్వకంగా లేఖల ద్వారా కోరాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలు తీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి సీ.ఈ.ఓ దృష్టికి తెచ్చారు. గడిచిన వారం రోజుల నుండి ప్రత్యేక చొరవ చూపుతున్న ఫలితంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో కూడా మ్యాపింగ్ ప్రక్రియలో ఆశించిన పురోగతి వచ్చిందని, గడువు లోపు మ్యాపింగ్ ను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. ఎస్.ఐ.ఆర్ అమలు కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ ను వెలువరించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి నిర్ణీత ఫార్మాట్ లో వారి వివరాలు సమర్పించేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా, తీవ్ర జాప్యం జరుగుతోందని కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలోనైనా బీ.ఎల్.ఓల సత్వర నియామకం ఆవశ్యకత గురించి నొక్కి చెప్పాలని, ప్రతీ వారం ఈ.ఆర్.ఓల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్.ఐ.ఆర్ అమలు తీరు గురించి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో బీ.ఎల్.ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారికి సహకారం అందించేందుకు వీలుగా వాలంటీర్లను సమకూర్చాలని ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల పేర్లు కలిగిన ఓటర్లను మ్యాపింగ్ సందర్భంగా ఖచ్చితంగా గుర్తించేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపాలి అనే దానిపై బీ.ఎల్.ఓలకు శిక్షణ అందించాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ జూన్ 15వ తేదీ లోపు పూర్తి అయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో ప్రముఖుల ఓటరు మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అన్నది ఈ.ఆర్.ఓలు స్వయంగా పరిశీలన జరపాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు, ప్రగతి గురించి రోజువారీగా ఆన్లైన్ లో వివరాలు పొందుపర్చాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా బీ.ఎల్.ఓల పేరు, ఫోన్ నెంబర్లతో కూడిన వివరాలను ఓటర్లకు తెలిసేలా విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ముఖ్య కూడళ్లలో బీ.ఎల్.ఓల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గుర్తింపు కార్డులు లేని బూత్ లెవెల్ అధికారులకు క్యూ.ఆర్ కోడ్ తో కూడిన ఐ.డీ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా, 6, 7, 8 ఫారాల పెండింగ్ క్లెయిమ్ లను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని, ఎస్.ఐ.ఆర్ అమలు కావడానికి ముందే జూన్ 5వ తేదీ లోపు అన్ని క్లెయిమ్ లు పరిష్కారం కావాలని గడువు విధించారు. మ్యాపింగ్ లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నిజామాబాద్ ఆర్.డీ.ఓ రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్.డీ.ఓ రవీందర్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, సీ.పీ.ఓ రతన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు ఇవ్వాలి

- గడ్డపార మొనకోసం రూ.200 కేటాయించాలి
- పే-స్లిప్పులు వెంటనే అందించాలి
- -- సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు

లిలివిజన్ ఆంధ్ర, మే 16, అక్కన్నపేట:లిలి ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలందరికీ వెంటనే పనిముట్లు అందించాలని, గడ్డపార మొనకోసం రూ.200 ప్రత్యేకంగా కేటాయించాలని, పే-స్లిప్పులను వెంటనే జారీ చేయాలని ప్రముఖ సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు డిమాండ్ చేశారు.

శనివారం హుస్నాబాద్ పరిధిలోని అక్కన్నపేట తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ప్రారంభించినప్పటి నుంచి సుమారు 20 సంవత్సరాలు గడిచినా కూలీలకు అవసరమైన పనిముట్లు సమగ్రంగా అందించలేదని విమర్శించారు.

కూలీలు గడ్డపార మొనకోసం తమ జేబు నుంచి రూ.200 వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. గతంలో ఇచ్చే పే-స్లిప్పుల ద్వారా కూలీలకు ఏ పనికి ఎంత మొత్తం చెల్లిస్తున్నారో స్పష్టంగా తెలిసేదని, ప్రస్తుతం పే-స్లిప్పులు ఇవ్వకపోవడంతో కూలి డబ్బులతో పాటు పనిముట్ల కోసం ప్రభుత్వం ఎలాంటి చెల్లింపులు చేస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. అందువల్ల కూలీలందరికీ వెంటనే పే-స్లిప్పులు అందించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా భరించాలని నిబంధనలు తీసుకురావడం వల్ల కూలీలకు పనులు దొరకకుండా చేసే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా 40 శాతం నిధులు విడుదల చేయకపోతే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధి హామీ పథకానికి కేటాయించే నిధులను ఇతర రంగాలకు మళ్లించడం అన్యాయమని, ఇది కూలీలను మోసం చేయడమేనని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి హామీ కూలీలు లింగాల పరశురాములు బుర్ర రవి బుర్ర సమ్మయ్య రాజు, మహేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ సమస్యలపై గ్రామ సభలో తీర్మానం

ముధోల్: మే 16:విజన్ ఆంధ్ర. ముధోల్ : మండలంలోని విట్టోలి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ కాలేవార్ రుచిత –దిగంబర్, వార్డు సభ్యులతో శనివారం గ్రామ సభను తీర్మానం చేశారు. గ్రామంలో కొన్ని ఏళ్ల క్రితంగా విరిగిన స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను వేయాలన్నారు. హనుమాన్ ఆలయం నుండి స్మశాన వాటిక, బుద్ధ విగ్రహం నుండి దత్తాత్రేయ గుట్ట వరకు కొత్త విద్యుత్ స్తంభాలను వేయాలని ఏఈ శ్రీకాంత్ కు వినతి పత్రాన్ని అందజేశారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ వెంకట నర్సయ్య,గ్రామస్తులు కృష్ణ, శంకర్ తో పాటు తదితరులున్నారు.

# నైపుణ్యత కొరకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం.

- సహాయ వ్యవసాయ సంచాలకులు, బ్లాక్ టెక్నాలజీ టీమ్ (బిటిటి ) కన్వీనర్ కె శంకర్ రాథోడ్.



పరిగి, మే 16(విజన్ ఆంధ్ర ): నైపుణ్యత కొరకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కార్యక్రమం శనివారం దోమ మండలం శివారెడ్డిపల్లి గ్రామంలోని రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ– ఆత్మ వారి సౌజన్యంతో శివారెడ్డిపల్లి సర్పంచ్ గూడటి లక్ష్మమ్మ అధ్యక్షతన ముఖ్య అతిథి సహాయ వ్యవసాయ సంచాలకులు, బ్లాక్ టెక్నాలజీ టీమ్ (బిటిటి ) కన్వీనర్ – ఆత్మ శంకర్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రాథోడ్ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు సాంకేతిక పరమైన విషయాలు తెలియజేశారు. నేటి సమాజం లో వ్యవసాయ రంగంల్లో వస్తున్న మార్పులు, నూతన పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణలో నవీన మార్పులు, నానో యూరియా, నానో డిఏపి వంటి వాటిని ఉపయోగించుకోవలసిన అవశ్యకత గురించి, జనుము , జీలగా, వరి విత్తన ఉత్పత్తి గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం తెలంగాణ ప్రొఫెసర్ జయ శంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త డా. స్వర్ణలత దేవి మాట్లాడుతూ వరిలో కొత్త, అధిక దిగుబడి ఇచ్చే వంగడాల గురించి , ఇతర పంటల సాగులో యాజమాన్యం పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం మరియు పప్పు ధాన్యాల పంటల సాగు గురించి తెలియచేశారు. మరో శాస్త్రవేత్త డా" అనూష మాట్లాడుతూ వివిధ రకాల పంటలలో చీడ పీడల నివారణ, వాటి ప్రాముఖ్యత గురించి రైతులకు తెలియ చేశారు. దోమ మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు మాట్లాడుతూ వివిధ రకాల పురుగు మందులు, గడ్డి మందుల పిచికారి చేసేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తల గురించి, సరక్షణ దుస్తులు పిపిఇ, తప్పనిసరి చేతికి గ్లౌజులు, కళ్లకు గాగుల్స్, ముక్కుకు మాస్క్/ఎన్95, తలకు టోపీ, పొడవాటి చేతుల చొక్కా ప్యాంటు, బూట్లు వేసుకోనీ పిచికారి చేసుకోవాలని సూచించారు. గాలికి ఎదురుగా నిలబడి పిచికారీ చేయకుండా గాలి వీచే వైపుకే పిచికారీ చేస్తే మందు మీద పడకుండా ఉంటుందని కళ్ళకు కట్టినట్టు వివరించారు.

ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంత కుమార్, మాజీ ఎంపీపీ రాఘవేందర్ రెడ్డి, దోమ మండల యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గూడటి శ్రీకాంత్ రెడ్డి , శివ రెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్ , హార్టికల్చర్ ఆఫీసర్ సంతోష్ కుమార్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు బాబ్య నాయక్, సంతోష్ కుమారు , చెన్నయ్య ,హారిక ,ఆత్మ సిబ్బంది బిటిఎం గణేష్ , గూడూరు గ్రామ సర్పంచ్ ఉషారాణి ఆంజనేయులు, బొంపల్లి సర్పంచ్ విజయ పవన్ , ఆత్మ బియఫ్ఎసి సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

--జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్.

--మాత శిశు ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్.

--ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై ఆరా తీసిన కలెక్టర్.

తాండూరు, మే 16 (విజన్ ఆంధ్ర) విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ మాత శిశు ఆసుపత్రి వైద్య సిబ్బందిని హెచ్చరించారు. తాండూరు పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రిని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) తాందూర్ మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఇటీవల జరిగిన ఘటనపై ఆరా తీశారు. అలాగే ఆసుపత్రి భవన పరిస్థితి, మరుగుదొడ్లు మరియు పారిశుధ్య సౌకర్యాలను పరిశీలించారు. నియమాలు మరియు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్యం, సిబ్బంది హాజరు రిజిస్టర్ లు,మందుల నిల్వలు మరియు రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.అలాగే ఆసుపత్రికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డాక్టర్ లు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శరత్ ,ఆర్ ఎం ఓ అనిల్, సునీత,మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి,వైద్యులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నందు నాయక్.

జన్నారం, మే 16 (విజన్ ఆంధ్ర) : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా నందు నాయక్, పట్టణ అ ధ్యక్షులుగా మంద రాజేష్ లను నియమించారు. జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా జ న్నారం గ్రామానికి చెందిన అజ్మీర నందు నాయక్ అదేవిధంగా పట్టణ అధ్యక్షులుగా గాంధీనగర్ కు చెందిన మంద రాజేష్ లు ఎన్నికయ్యారు.ఈ మేర కు శనివారం రోజున టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నుండి నియామక పత్రాలు జారీ అ య్యాయి. ఈ సందర్భంగా నందు నాయక్, మంద రాజేష్ లు మాట్లాడుతూ తమకు పదవులు రావ డానికి కృషి చేసిన ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ కు కృ తజ్ఞతలు తెలిపుతూ పార్టీ పటిష్టత కొరకు తమ శక్తి వంచన లేకుండా నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.



# మండలంలో టీజీ వెంకటేష్ జన్మదినోత్సవం వేడుకలు

మంగపేట మే 16 ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ పారిశ్రామికవేత్త టీజీవీ గ్రూప్ చైర్మన్ ఆర్యవైశ్య నాయకులు సంఘ సేవకులు మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగపేట శివాలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు అనంతరం కస్తూరిబా అనాథ ఆశ్రమంలో స్వీట్లు పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ సమాజ సేవలో ఆర్యవైశ్యుల అభివృద్ధిలో చేసిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్ధంశెట్టి వైకుంఠం ములుగు జిల్లా గౌరవ అధ్యక్షులు సిద్ధంశెట్టి శ్రీనివాసరావు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధంశెట్టి లక్ష్మణరావు జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల కృష్ణమూర్తి నెరెళ్ల బతకయ్య మాడిశెట్టి కృష్ణమూర్తి సిద్ధంశెట్టి ఆనందం సిద్ధంశెట్టి వెంకటేశ్వర్లు సిద్ధంశెట్టి శ్రీను గార్లపాటి సతీష్ గార్లపాటి సత్యనారాయణ గుండా రమేష్ సిద్ధంశెట్టి కనకరావు పాల్గొన్నారు.

# నిరుపేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

ఇల్లందు, మే 16 (విజన్ ఆంధ్ర):తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశీర్వాదాలతో కొలువుదీరిన ప్రజా ప్రభుత్వంలో నిరుపేదల పక్షపాతిగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని, రాష్ట్రంలో ప్రతి పేదవాడికి ఉండడానికి ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్ అన్నారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు శనివారం మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను లబ్దిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు దఫాలుగా ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని, నాలుగు విడతల్లో ఇందిరమ్మ ఇండ్లకు బిల్లులను నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లను పూర్తి నాణ్యతతో లబ్ధిదారులు దగ్గరుండి పనులను పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోళ్ళ సూర్యం , 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్, 20 వార్డు కౌన్సిలర్ ఎండి జాఫర్, మాజీ వార్డు కౌన్సిలర్ అంకె పాక నవీన్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సతీష్ కుమార్ పాసి, మాదాసు సుమన్, ఆలేటి చిన్ని, పోట్ల శ్రీను, కోలపురి ఝాన్సీ, తోకల అశోక్, దోరేపల్లి మమత, రాజు, బమాండ్ల రమేష్, శ్రీకాంత్, నాయిని వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి వైద్యాధికారిణి డాక్టర్ ఝాన్సీ

బెల్లంపల్లి , మే 16 విజన్ ఆంధ్ర : ప్రపంచ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తాండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో శనివారం డెంగ్యూ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారిణి డాక్టర్ ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా అవగాహన ర్యాలీ చేపట్టి, అనంతరం డెంగ్యూ నివారణకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో శ్రీనివాస్ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.



ఈ సందర్భంగా డాక్టర్ ఝాన్సీ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధిని నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలని తెలిపారు. అధిక జ్వరం, తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, కండరాలు మరియు కీళ్ల నొప్పులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సూచనలు పాటించాలని తెలిపారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, చెత్తను పేరుకుపోనివ్వకపోవడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా డెంగ్యూ వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బండి భగీరత్ ను వెంటనే అరెస్టు చెయ్యాలి.

## ఎల్ హెచ్ పి ఎస్ కార్యదర్శి, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్.



పరిగి, మే 16(విజన్ ఆంధ్ర ): మైనర్ బాలిక అత్యాచార పోక్సో కేసు నిందితుడు కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్ ను వెంటనే అరెస్టు చెయ్యాలని ఎల్ హెచ్ పి ఎస్ కార్యదర్శి, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. ఇ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి రోజు భారత్ మాతాకీ జై అని దేశ భక్తి గురించి చెప్పే కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కీ మైనర్ బాలికలో భరత మాత కనిపించడం లేదా పెద్ద పెద్ద హోదాలో ఉన్న కోటీశ్వరుల మహిళలలో మాత్రమే భారత మాత కనిపిస్తుందా అని ప్రశ్నించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ఎందుకు స్పందించడం లేదు. దేశ ప్రధానమంత్రి మోదీ వెంటనే బండి సంజయ్ ను కేంద్ర హోం సహాయ మంత్రి పదవీనుండి తొలగించాలని కోరారు. నిరుపేదలు తప్పు చేస్తే నిర్భయ, ఫోక్సో, దిశా చట్టాల ద్వారా వెంటనే అరెస్టులు, జైలు శిక్ష లేదా ఎన్ కౌంటర్ చేసేస్తారు మరి పెద్దోళ్ళు తప్పు చేస్తే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిని కాపాడడానికి షీట్ లు ఏర్పాటు చేసి ఆ కేసులు పక్కదోవ పట్టేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలు అందరికీ సమానం అయితే కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి భగీరత్ ను కూడా వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని యెడల రాష్ట్రం లో అన్ని సామాజిక ప్రజా సంఘాలను, కలుపుకొని రాష్ట్ర డీజీపీ కార్యాలయం , బీజేపీ కార్యాలయంను ముట్టడిస్తామని, మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోలు, రవాణా మరియు అన్‌లోడింగ్ కార్యకలాపాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

## -- సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్.

గజ్వేల్, 16 మే 2026 (విజన్ ఆంధ్ర) : ప్రస్తుతం కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు, రవాణా మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలు సజావుగా సాగేందుకు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ తెలిపారు. ఈ ఏర్పాట్లలో భాగంగా, ఐకేపీ మరియు ప్యాక్స్ కొనుగోలు కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తూ, గుర్తించిన అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ధాన్యం అన్‌లోడింగ్ జరుగుతున్న రైస్ మిల్లులను కూడా పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నారు. సున్నితమైన మరియు సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రైతులు ధాన్యం కొనుగోలు, రవాణా మరియు అన్‌లోడింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాలు మరియు రవాణా మార్గాల వద్ద పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ రద్దీ, వివాదాలు మరియు రవాణాలో జాప్యాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు కూడా తీసుకుంటున్నారు. సమర్థవంతమైన భద్రతా అమలుకు రెవెన్యూ, సివిల్ సప్లైస్ మరియు ఇతర సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని క్షేత్రస్థాయి పోలీసు అధికారులకు సూచించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ జిల్లా వ్యాప్తంగా పలు కొనుగోలు కేంద్రాలు, రవాణా మార్గాలు మరియు రైస్ మిల్లులను స్వయంగా సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రశాంతంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని, రైతులకు అన్ని విధాలా సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సీజన్ మొత్తం రైతులకు సురక్షిత వాతావరణం కల్పిస్తూ, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు సిద్దిపేట పోలీసులు కట్టుబడి ఉన్నారని కమిషనర్ తెలిపారు.

# లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్న మిద్దెల జితేందర్

భువనగిరి మే 16( విజన్ ఆంధ్ర ): రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ శనివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు శాలువా తో ఘనంగా సన్మానించినారు. అనంతరం పిట్టల బాలరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను రేషన్ కార్డులు, సన్న బియ్యం, రుణమాఫీ, ఉచిత 200 యూనిట్ల కరెంటు, మహిళలకు ఫ్రీ బస్సు లాంటి ఎన్నో పథకాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో మరియు టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు జిల్లా ఐలయ్య నాయకత్వంలో ముందుకు తీసుకు వెళుతున్నామని తెలిపారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో బూతు స్థాయి కమిటీలు, మండల స్థాయి కమిటీలు, పట్టణ స్థాయి కమిటీలు బలోపేతం చేసుకుని రాబోయే రోజులలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ కి రాష్ట్ర కార్పొరేషన్ మరియు ఎమ్మెల్సీ అని ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే రోజులలో కూడా జిల్లా స్థాయిలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భాష, జనరల్ సెక్రటరీ సురేందర్ సేవాదళ్ నాయకులు ధర్పల్లి ప్రవీణ్ కుమార్ జిల్లా అధ్యక్షులు సామల రవీందర్,రాజు,సురేందర్, రాజేష్,గుమ్మడి రమేష్, దాకురి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి- ఎంపీడీఓ

పరిగి, మే 16(విజన్ ఆంధ్ర ): వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎంపీడీఓ గ్యామ నాయక్ కేంద్రం నిర్వాహకులకు ఆదేశించారు. శనివారం దోమ మండల పరిధిలోని దాదాపూర్ గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల అభివృద్ధి అధికారి గ్యామ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతులు, గన్ని బ్యాగులు, పుస్తక నిర్వాహణ, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు పంపడానికి కావాల్సిన ట్రాన్స్పోర్టేషన్ , ధాన్యం కొనుగోలు చేసిన రైతుల సమాచారాన్ని ట్యాబ్ నందు ఎంట్రీ చేస్తున్న సమాచారాన్ని కేంద్రం నిర్వాహకులు శేఖర్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొగులయ్య, చెన్నయ్య, పెంటయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమానాస్పదంగా ఆవు మృతి

కుల్కచర్ల, మే 16(విజన్ ఆంధ్ర): అనుమానాస్పదంగా ఆవు మృతి చెందిన సంఘటన ముజాహిద్ పూర్ గ్రామంలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...కుల్కచర్ల మండలం ముజాహిద్ పూర్ గ్రామానికి చెందిన బంగారు.వెంకటయ్య అనే రైతు తన పొలంలో ఎప్పటిలాగే శనివారం మధ్యాహ్నం తన దగ్గర ఉన్న ఆవును మేతకు కట్టి వేసి ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో పొలం దగ్గరకు వెళ్లి చూడగా ఆవు పొలంలో కిందపడినట్లు గమనించాడు. దగ్గరకు వెళ్ళి చూడగా అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. వేల రూపాయలు విలువ చేసే ఆవు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు. ఎండల తీవ్రత పట్ల మృతి చెందిందా లేక మరే ఇతర కారణాల వల్ల చనిపోయిందా అనే వివరాలు తెలియడం లేదని రైతు అనుమానాస్పదం వ్యక్తం చేశాడు.

### ఉపాధి హామీ చట్టాన్ని

# నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం...

### సీపీఐ(ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా)బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లేష్..

బోధన్, మే16 (విజన్ ఆంధ్ర) : బోధన్ మండలంలోని ఎరాజ్ పల్లి గ్రామ చెరువు వద్ద ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సీపీఐ (ఎం-ఎల్) మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ, ఏఐకేఎంఎస్ ల ఆధ్వర్యంలో శనివారం సందర్శించారు. ఈ నాయకులు మల్లేష్, లక్ష్మణ్ లు మాట్లాడుతూ పనులు చేస్తున్న కార్మికులకు మండుతున్న ఎండల నుండి రక్షణ కోసం టెంట్ లాంటి ఏర్పాట్లు లేవని, ఏవైనా గాయాలయితే ఫస్ట్ ఎయిడ్ కోసం ఎలాంటి ఏర్పాట్లు లేవన్నారు. పనిచేస్తున్న కార్మికులకు వారం వారం బట్వాడాలు రాక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని వారి కూలీలను ప్రతి వారం ఒకసారి చెల్లించాలని, అదేవిధంగా టెంట్లు మంచినీరు ఫస్ట్ ఎయిడ్ బాక్స్ పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఉపాధి హామీ పనులకు అయ్యే ఖర్చులను గతంలో కేంద్ర ప్రభుత్వము 90శాతం ఇచ్చేదని కానీ దాన్ని 60 శాతానికి తగ్గించిందని రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో 10 శాతం మాత్రమే చెల్లించేవని కానీ దాన్ని 40 శాతానికి పెంచిందని దీని మూలంగా రాష్ట్రాల వద్ద నిధుల కొరతతో పనులు జరగక ఈ ఉపాధి హామీ పనులను నిర్వీర్యం చేయాలని చూస్తుందని మండిపడ్డారు.

## పుట్ట మధు జన్మదినం సందర్భంగా...

# రక్తదానం చేసిన బి ఆర్ ఎస్ నాయకులు..

మహాదేవపూర్ మే 16 (విజన్ ఆంధ్ర) మంథని మాజీ శాసనసభ్యులు పుట్ట మధుకర్ జన్మదినన్ని పురస్కరించుకొని రుద్రారం గ్రామంలో రక్తదాన శిబిరన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కాళేశ్వరం గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు ఆరుట్ల పవన్ , అడప సంతోష్ పటేల్, చకినారపు శశి కుమార్, కాటారపు శ్యామ్, బడికల మహేందర్ రక్తదానం చేసారు. ఈ సందర్భంగా రుద్రారం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో పుట్ట మధుకర్ మాట్లాడుతూ మంథని నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తానని అయన అన్నారు. మంథని నియోజకవర్గ ప్రజానీకం అంత నా కుటుంబం తో సమానం ఎవరికీ ఏ ఆపద వచ్చిన మీ కోసం మంథనిలో రాజా గృహం ఉందని మర్చిపోవద్దు అన్నారు. నా జన్మదిన వేడుకలకి నియోజకవర్గ అభిమానులు అందరూ రావటం నాకు ఆనందంగా ఉంది అన్నారు.



# స్వలాభం కోసం తప్పుడు సమాచారం

### - ఇసుక సొసైటీ సభ్యుల ఆగ్రహం

మంగపేట మే16 (విజన్ ఆంధ్ర) : మండలంలోని వాడగూడెం రమణక్కపేట అకినేపల్లి మల్లారంలో గిరిజనుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఇసుక సొసైటీలను రద్దు చేయాలని కొందరు స్వార్థపరులు చూడటం సరికాదని ఇసుక సొసైటీ సభ్యులు మండిపడ్డారు శనివారం మంగపేట మండలం వాడగూడెంలో శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఇసుక క్వారీ సొసైటీ సభ్యులు అత్యవసర సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఇసుక క్వారీ సొసైటీ కార్యదర్శి మడి సాయి కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతాల్లో అత్యంత వెనుక బడి ఉన్న గిరిజ నులకు గ్రామ స్థానికులకు ఉపాధి కల్పిం చేందుకు ఇసుక క్వారీల నిర్వహణ బాధ్యతలు గిరిజన సొసైటీలకు ఇచ్చి ఈ సొసైటీలను ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు కానీ కొంతమంది కావాలని మూడు గ్రామాలలో నిర్వహిస్తున్న ఇసుక సొసైటీలను రద్దు చేయడం కోసం అధికారులకు తప్పుడు సమాచారం అందజేస్తూ అధికారులను తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకొని గిరిజనుల గ్రామాల ప్రజల అభివృద్ధికి దోహదపడాలని కోరారు ఈ కార్యక్రమంలో మడి శోభన్ మోడెం వెంకటేశ్వర్లు మడి ఎర్రయ్య మడి సత్యం చింత ముత్తయ్య పోలేబోయిన శ్రీనివాస్ మడి మోహనరావు మడి సాయికుమార్ మడి సంజయ్ కుమార్ వాసం పవన్ మొగిలిపల్లి రాంబాబు మోడెం లక్ష్మణ్ చింత జీవన్ మడి వేణు గోపాల్ పోలేబోయిన రవ రాజు బడి నర్సయ్య పూనెం బీమయ్య పాల్గొన్నారు.

# జన్మదిన సందర్భంగా ఆర్టీసీ బస్సు సేవల ప్రారంభం

### - ప్రజలకు ఉపయోగపడే సేవలను అందించడం ఆనందంగా ఉంది: ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల, మే 16 (విజన్ ఆంధ్ర): ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉంది అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శనివారం ఆయన జన్మదిన సందర్భంగా చేవెళ్ల మండలంలోని కమ్మెట ఎక్స్‌రోడ్డు వద్ద వికారాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన ఎన్కేపల్లి - మైదిపట్నం బస్సును ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, విద్యార్థులు, ఉద్యోగుల నిత్య ప్రయాణాలకు ఈ బస్సు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా ప్రజలకు మేలు చేసే సేవను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కమ్మెట, ఎన్కేపల్లి, ఈర్లపల్లి, గొల్లగూడెం, తంగడపల్లి, గొల్లపల్లి గ్రామాల ప్రజలకు ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమ్మెట, ఎన్కేపల్లి, ఈర్లపల్లి, గొల్లగూడెం, తంగడపల్లి, గొల్లపల్లి సర్పంచులు కృష్ణపద్మమ్మ, మైపాల్ రెడ్డి, లావణ్యరాజశేఖర్, చెవుల నర్సింలు, రాములు, శ్రీనివాస్ గౌడ్ చేవెళ్ల, ముడిమ్యాల్ పిఎసిఎస్ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాపరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు బందారి ఆగిరెడ్డి, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడు, వైస్ చైర్మన్ బేగరి రాములు, చేవెళ్ల మున్సిపల్ కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్, ముడిమ్యాల్ మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ కందికొండ మహేందర్ గౌడ్, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక కొరతతో నిర్మాణ రంగం కుదేలు..!



**- ఇసుక లేక పనులు లేవు - పనులు లేక జీవనం లేదు..**

**- రాంపుల లేమి -- బిల్లుల జాప్యం -- ఉపాధి కోల్పోతున్న కార్మికులు.**

**- - ట్రాక్టర్ యజమానుల నుంచి తాపీ మేస్త్రిల వరకు తీవ్ర సంక్షోభం..**

పాల్వంచ ప్రతినిధి, మే 16 (విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఇసుక కొరత తీవ్ర స్థాయికి చేరుకుంది. అధికారిక ఇసుక రాంపులు లేకపోవడం, ఉన్న ఒక్క రాంప్ నుంచే తొలకాలు జరిపినా నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటం, స్థానిక వాగుల నుంచి ఇసుక తరలిస్తే అధికారుల కేసులు, వాహనాల సీజ్ చర్యలు చేపట్టడం వంటి పరిణామాలతో ట్రాక్టర్ యజమానులు, కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల వరకు నిర్మాణ రంగానికి ఆధారంగా నిలిచిన వందలాది మంది ట్రాక్టర్ యజమానులు ప్రస్తుతం అప్పుల భారంతో కుంగిపోతున్నారు. డీజిల్ ధరలు, వాహనాల మెయింటెనెన్స్ ఖర్చులు పెరుగుతున్న తరుణంలో పని లేక ఆదాయం ఆగిపోవడంతో చాలా మంది వాహనాలను నిలిపివేసే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రోజువారీగా ట్రాక్టర్లపై ఆధారపడి జీవించే డ్రైవర్లు, కూలీలు ఉపాధి లేక పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది.

**ఆరునెలలైనా రాని బిల్లులు..!**

ప్రభుత్వ అనుమతులతో ఇసుక తొలకాలు నిర్వహించినా బిల్లులు ఆరునెలల వరకు విడుదల కాకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. అప్పులు చేసి పనులు చేసిన ట్రాక్టర్ యజమానులు బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి చెల్లింపులు లేకపోవడంతో బ్యాంకు ఈఎంఐలు, ఫైనాన్స్ వడ్డీలు చెల్లించలేక ఆర్థికంగా కుదేలవుతున్నామని చెబుతున్నారు.

**స్థానిక వాగుల నుండి ఇసుక తీస్తే కఠిన చర్యలు..**

ఇసుక కొరత నేపథ్యంలో కొంతమంది స్థానిక వాగుల నుంచి ఇసుక తరలించేందుకు ప్రయత్నిస్తే పోలీస్, రెవిన్యూ, అటవీ, మైనింగ్ అధికారులు కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ తవ్వకాలను అరికట్టాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ప్రత్యామ్నాయంగా అధికారిక రాంపులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని ప్రజలు అంటున్నారు.

**నిలిచిపోయిన నిర్మాణాలు..**

ఇసుక అందుబాటులో లేకపోవడంతో పట్టణంలో అనేక నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వ్యక్తిగత గృహ నిర్మాణాలతో పాటు ప్రభుత్వ పథకాల కింద నిర్మిస్తున్న ఇండ్ల పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక దొరకక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినా, నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులు ముందుకు సాగడం లేదని బాధితులు వాపోతున్నారు.

**ఉపాధి కోల్పోతున్న తాపీ మేస్త్రిలు..**

నిర్మాణ రంగం స్తంభించడంతో తాపీ మేస్త్రిలు, సెంటరింగ్ కార్మికులు, మజ్దూర్లు కూడా ఉపాధి కోల్పోతున్నారు. రోజువారీ కూలిపై ఆధారపడే కుటుంబాలు ఆదాయం లేక ఆర్థికంగా కష్టాల్లోకి జారుతున్నాయి. ఇసుక లేక పనులు లేవు... పనులు లేక జీవనం లేదు అనే పరిస్థితి నిర్మాణ రంగ కార్మికులలో కనిపిస్తోంది.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి..**

ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం అత్యవసర సమస్యగా గుర్తించాలని ప్రజలు, ట్రాక్టర్ యజమానులు, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అధికారిక ఇసుక రాంపులకు వెంటనే అనుమతులు ఇవ్వడం, స్థానిక అవసరాలకు అనుగుణంగా కొత్త రాంపులు ప్రారంభించడం, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయడం ద్వారా మాత్రమే పరిస్థితి మెరుగుపడుతుందని వారు చెబుతున్నారు. లేనిపక్షంలో ట్రాక్టర్ యజమానులు అప్పుల బారిన పడి రోడ్డున పడే ప్రమాదం ఉందని, వేలాది మంది కూలీలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలంటే ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

# గ్రామీణ మహిళల సాధికారతకు యూనియన్ బ్యాంక్ చేయూత

## -74 ఎస్‌హెచ్‌జీలకు రూ.10.20 కోట్ల రుణాలు పంపిణీ

ఖిల్లా ఘనపురం,(విజన్ ఆంధ్ర) మే 16: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "యూనియన్ తేజస్" ప్రచారంలో భాగంగా వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ బ్రాంచ్‌లో శుక్రవారం వ్యవసాయ అవుట్ రీచ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 74 స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జీలు) రూ. 10.20 కోట్ల రుణ చెక్కులను పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంక్ హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ రవీంద్రబాబు మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ మహబూబ్‌నగర్ రీజినల్ హెడ్ డి. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ఎస్‌హెచ్‌జీ రుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అలాగే వ్యక్తిగత వ్యాపారులకు వ్యాపార రుణాలు, రైతులకు పంట రుణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామీణ నిరుద్యోగ యువత =ాజు× శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, సమగ్ర పురోగతికి యూనియన్ బ్యాంక్ కట్టుబడి పనిచేస్తోందని కార్యక్రమంలో అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డీఆర్‌డీఏ సరోజ, డీపీఎం నాగ మల్లిక, యూనియన్ బ్యాంక్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్, ఖిల్లా ఘనపూర్ బ్రాంచ్ మేనేజర్ మల్లికార్జున, ఏపీఎం నాగరాజు, ఎల్డీఎం కార్యాలయానికి చెందిన సాయి కుమార్, బ్యాంకు సిబ్బంది, డీఆర్‌డీఏ అధికారులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలి– కూర వెంకటేష్

భువనగిరి మే16( విజన్ ఆంధ్ర): భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో అందిస్తున్న సీ.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సద్వినియోగం చేసుకోవాలి అని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, 30వ వార్డు కౌన్సిలర్ వీ.స.లయిక్ అహ్మద్ అన్నారు. భువనగిరి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో భువనగిరి పట్టణానికి చెందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించడం జరిగింది. మటూరి శివ చందు 20,000=00, సల్మాబేగం 16,500=00,భాను బేగం 30,000=00లకు చెక్కు అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేద ప్రజల కొరకు శ్రామిస్తున్నారని అన్నారు. వారి సహకారంతో అందిస్తున్న ఇట్టి చెక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమ ఫలాలను ఎమ్మెల్యే పేద ప్రజల దగ్గరికి చెర వేస్తున్నారని అన్నారు.

# శివంపేట్ గ్రామంలో మంజీరా నది నుంచి అక్రమ ఇసుక తరలింపు

- స్థానికుల ఆందోళన
- పర్యావరణానికి ముప్పు
- అధికారుల మౌనం
- పగటిపూట నిశ్శబ్దంగా ఉంటూ..

**చీకటి పడగానే ట్రాక్టర్లు, టిప్పర్లతో భారీగా ఇసుకను తరలింపు**



చౌటకూర్ మే 16 విజన్ ఆంధ్ర :- మండల పరిధిలోని శివంపేట్ గ్రామ శివారులో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. మంజీరా నది నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్లు స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పగటిపూట నిశ్శబ్దంగా ఉంటూ.. చీకటి పడగానే ట్రాక్టర్లు, టిప్పర్లతో భారీగా ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యావరణానికి ముప్పు:నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ తవ్వకాల వల్ల మంజీరా నదీ తీర పర్యావరణం పూర్తిగా దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు హెచ్చరిస్తున్నారు. ఇసుకను విచ్చలవిడిగా తోడేయడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని, భూగర్భ జలాలు అడుగంటిపోయే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా, నది పరివాహక ప్రాంతాల్లో మట్టి క్షయం జరిగి, సమీపంలోని పంట భూములు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఆధారాలతో ఫిర్యాదు:అక్రమ రవాణాకు సంబంధించిన ఫోటోలు, అర్ధరాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్న వీడియో ఆధారాలతో స్థానికులు ఇప్పటికే అధికారులను ఆశ్రయించారు. పోలీస్ శాఖ, గ్రామ పంచాయతీ మరియు నీటి వనరుల సంరక్షణ సంఘాలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి, తక్షణమే విచారణ జరపాలని డిమాండ్ చేశారు. గ్రామస్థుల ప్రధాన డిమాండ్లు:మంజీరా నది నుంచి సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై రెవెన్యూ, పోలీస్ అధికారులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి. నదీ పరిరక్షణ కోసం తీర ప్రాంతంలో ప్రత్యేక నిఘా మరియు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేయాలి. అధికారుల మౌనం ఈ వ్యవహారంపై చౌటకూర్ మండల అధికారులు కానీ, మైనింగ్ మరియు సంబంధిత శాఖల అధికారులు కానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అధికారుల స్పందన కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంజీరా నదిని కాపాడాలని శివంపేట్ ప్రజలు కోరుతున్నారు.